
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
24.3.2024

## బహుళ ప్రజాదరణ పొందిన

# రంగస్థలం



# చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపులు తిరుగుతోంది మరో ఇద్దరు ఏఎస్పీలు అరెస్ట్ అయ్యారంటూ కథనాలు వస్తున్నాయి. ఇదంతా రాజకీయ ప్రేరేపిత కుట్రలుగా చాలా మంది భావిస్తున్నారు. సర్ మీరేమంటారు?**

**– అలేఖ్యా చిత్తరంజన్, హైదరాబాద్**

మీరు విన్నది నిజమే అలేఖ్య గారూ ... రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. అదనపు ఎస్పీలు భుజంగరావు ,తిరుపతన్నలు తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వెస్ట్ జోన్ డీసీపీ ఇద్దరిని అరెస్టు చేసినట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఈ ముగ్గురు కలిసి ప్రముఖుల వ్యక్తిగత ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లుగా గుర్తించారు. అనధికారంగా పలువురి ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ చేసి ఇప్పటికే పలువురు ప్రముఖుల వ్యక్తిగత విషయాలను తెలుసుకున్నట్లు గుర్తించారు. బాధ్యత గల ప్రభుత్వ అధికారిగా పనిచేస్తూ పలువురు వ్యక్తుల కోసం పనిచేసినట్లుగా పేర్కొన్నారు. అంతేకాదు గత ప్రభుత్వానికి ఫోన్ టాపింగ్ సమాచారం కూడా ఇచ్చినట్లు గుర్తించారు. టాపింగు డివైస్‌లతో పాటు హార్డ్వేర్లను ధ్వంసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో ప్రధాన పాత్ర పోషించిన నిందితుడు ప్రణీత్ రావును ఇప్పటికే 6 రోజుల పాటు పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించిన విషయం తెలిసిందే. నేడు మరోసారి ప్రణీత్ రావును విచారించనున్నారు. మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి కస్టడీకి కోరే అవకాశం ఉంది. ఇక ఈ కేసులో అరెస్టైన ఇద్దరు ఎస్పీలు వివిధ భాగాలకు చెందిన వారని డీఎస్పీ తెలిపారు. భుజంగరావు భూపాలపల్లి ఎస్పీ పనిచేస్తుండగా.. ఇంతకు ముందు ఇంటెలిజెంట్ పొలిటికల్ వింగ్ లో అనదపు ఎస్పీగా కూడా పని చేశారు. ప్రస్తుతం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇక మరోవైపు ఎస్బీఐలో పనిచేస్తున్న అదనపు ఎస్పీ తిరుపన్నను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ లోని పీఎస్ లో స్పెషల్ టీమ్ ముందు తిరుపన్న హాజరయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఎస్బీఐలో పనిచేసిన వాళ్లందరినీ పోలీసులు విచారించేందుకు ప్రయత్నిస్తు న్నారు. వీరిని విచారించడం ద్వారా వచ్చే సమాచారంతో మరొకొంత మందిని విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు కూడా పాల్గొంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంకా ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు భారీ పోలీస్ ఆపరేషన్ చేపట్టారు. ఇఖ డిసెంబర్ 4వ తేదీన ఈ కేసులో కీలక రికార్డులు ధ్వంసమైన సమయంలో నెలకొన్న పరిస్థితులు, పరిణామాలపై పోలీసులు స్టేట్మెంట్ కూడా నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఇప్పటికే వికారాబాద్ ఫారెస్ట్, మూసీ రివర్ లో హార్డ్ డిస్కుల శకలాలు స్వాధీనం చేసుకున్నారు.

**అకాల వర్షాలతో గత వారంలో నాలుగైదు రోజులు భానుడి భగభగలు తగ్గాయి. కానీ వేసవికాలం కావడంతో సూర్యుడి తీవ్రత అధికం అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మరోవైపు 3 వారాల నుంచి ఎండలకు రాయలసీమ మండిపోతోంది. శనివారం (మార్చి 23న) దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత అనంతపురంలో 40.8 డిగ్రీలుగా నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ ప్రకారం చూస్తుంటే రానున్న వేసవిలో ఎండ వేడి కారణంగా ఉక్కపోత సైతం అధికం కానుందనిపిస్తోంది. మీరేమంటారు**

**– కొల్లూరు జ్యోత్స్న, అనంతపురం**

అవును జ్యోత్స్న గారూ.. గత ఏడాది తరహాలోనే ఈసారి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో నేటి నుంచి మరో 4 రోజులు పొడి వాతావరణం ఉ ంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత వారానికి భిన్నంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 2, 3 డిగ్రీలు అధికంగా ఉంటాయి. ఏపీలో శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. కానీ రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో వాతావరణం పొడిగా మారనుంది. తెలంగాణలో ఫిబ్రవరి నెలలోనే ఎండలు అధికమయ్యాయి. మార్చి రెండో వారం వరకు ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగి పలు ప్రాంతాల్లో 39, 40 డిగ్రీలుగా నమోదయ్యాయి. నేటి నుంచి మరో 4 రోజులపాటు పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ దిశ నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయి. ఈ నాలుగైదు రోజులు మధ్యాహ్నం 12 నుంచి 3 వరకు అత్యవసరమైతే తప్పా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు. పలు జిల్లాలల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశం ఉంది. రాత్రి పూట సైతం ఉక్కపోత తప్పదు. ప్రజలు నీళ్ల ఎక్కువగా తాగాలని.. ఎండలో బయటకు వెళ్లేవారు కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు తాగడం మంచిది ఏపీలోనూ సూరీడు సుర్రుమంటున్నాడు. మరో 4 రోజులు రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏపీలో కొన్నిచోట్ల తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తాంధ్రతో పాటు దక్షిణ కోస్తాంధ్రలోనూ ఎండల తీవ్రత అధికంగా ఉండనుంది. 2 నుంచి 3 డిగ్రీలు పగటి ఉష్ణోగ్రత పెరుగుతుందని ప్రజలు ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమకు స్వల్ప వర్ష సూచన ఉంది. అయినా వేడి, ఉక్కపోత వాతావరణం ఉంటుందని, ప్రజలు అసౌకర్యానికి లోనవుతారని ఓ ప్రకటనలో తెలిపింది.

# లెజెండ్

## విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్

అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వ శాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళు తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం.

విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లో గల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు.

న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి.

గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్‌ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వ విద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచే వారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీలో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారు చేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బ్కెనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, %టశ్రీబఇ- ఱశీఅం% యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు %--% ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు.



భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాల మీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి.

(1).మొదటి సూత్రము... "బాహ్యాబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము... "ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3).న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది.

మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను "భౌతిక శాస్త్ర పితామహుడు" అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటి నుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు.

తరువాత కూడా ఎన్నో మైలు రాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

### కవిత్వమంటే..!



కవిత్వమంటే..
శిశిరం నుండి వసంతమైన చిగురాకు,
ఎద తాపంపై వర్షించిన తొలకరి
చిరుజల్లు,
బతుకులలో చీకటిని ఛీల్చిన
కాంతిపుంజం,
ఆరుగాలం శ్రమించి కవిరైతు
పండించిన పంట...!
కవిత్వమంటే..
పేదల పక్షాన గోంతెత్తిన గళం,
కలం పట్టి కదలించిన చైతన్య ఉ
ద్యమం,
న్యాయ పక్షమై నినదించిన ప్రజల
నాలుక,
పీడనపై పిడికిలిని బిగించిన ఎర్ర
బావుటా..!
కవిత్వమంటే..
అనంతంగా చిత్రించిన శబ్ద చిత్రం,
మాతృభాషలో ఆలాపించే జీవన గీతిక,
నిజానిజాలపై వ్యాఖ్యానించిన
నిప్పుకణిక,
అక్షరబద్ధమైన దేశ కాల భావ చరిత్ర..!
కవిత్వమంటే..
మనసు పొరల సంక్లిష్ట భాష,
నిదుర లేపే చిత్తరువుల సుమాలిక,
విభిన్న సంఘర్షణలను ఎదుర్కొనే
సవ్యసాచి,
సరికొత్త మార్పుకు శ్రీకారం..!
కవిత్వమంటే..
ఉండబట్టలేనితనం నుండి
ఉప్పొంగిన భావాల చెలిమె..!


**–డా. వాసాల వరప్రసాద్, 9490189847**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

మెక్సికోలో మహిళా వాహన చోదకులపై రచయిత వివి రావు గారు రచించిన ప్రత్యేక కథనం చాలా బాగుంది. అనేక అంశాలను జత కూర్చి వివరణాత్మకంగా ఇచ్చిన వ్యాసం ఉపయుక్తం. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురిం చాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవా దాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఞతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

### కవిత్వమంటే



కవిత్వమంటే
మహా సంద్రంలో తొనికిసలను కూడా
పదనిసలుగా మార్చే సాహిత్య ఉరవడి
చిరు నగవుల చిద్విలాషపు ఝరులను
పదాలుగా పలికించే సవ్వడి
భావ పరిమళాల పరిపక్వతలో
ఓలలాడించు వాక్య నిర్మాణం
కవిత్వమంటే సులభం కాదు సుమీ
కవి హృదయ తరంగపు శబ్ధంలో
సమకాలీన భావాన్ని రంగరించే
నేటి మేటి మాటకు ప్రతిరూపం

**నెల్లుట్ల సునీత**
**7989460657**

### దాహం తీరని తపన




అనంత నిశీధిలో
నిరంతరం అన్వేషణ
దేని కోసం అంటూ
అంతరాత్మా సంధించని ప్రశ్న
ఏకాంతానికి ఒంటరితనానికి
నడుమ వూగిసలాడుతూ మౌనరాగం
నెరవేరని నిరీక్షణలో
గుండెగూటిలో శిధిల జ్ఞాపకాల
సంఘర్షణ
దరి చేరని నిరాశలో
ఆశలపూల రహదారిలో దాహంతీరని
తపన
కాలం రాసిన నిఘంటువులో
నీకూ నాకూ మధ్య రాలిన కానరాని
పదాలు
మన మది గదిలో
పేరుకొన్న కవితలు ప్రపంచానికి
దొరకని నిధులు
పెదవి దాటని మన వ్యధ
ఎప్పటికీ మది కంచె దాటి కంచికి
చేరని కథ

**– సురేంద్ర రొడ్డ , 9491523570**

# ఓ త్యాగమూర్తి సాహస కృత్యమే 'కన్నీటిలేఖ'

ఒక విప్లవకారుడు అనూహ్య పరిస్థితుల్లో దండులో చేరవలసి వస్తుంది. ఇంట్లో తన అర్ధాంగికి సైతం చెప్పకుండా రహస్యంగా వెళ్ళిపోతాడు. వెళ్ళి పోరుభూమి నుండి తన భార్యకు ఒక లేఖ రాస్తాడు. అదే కళింగాంధ్రకు చెందిన ప్రముఖ అభ్యుదయ కవి 'సీరపాణి' రచించిన వచన కవిత కన్నీటిలేఖ. ఈ కవిత ఈయన రచించిన 'డమరుధ్వని' కవిత సంపుటి లోనిది.

**'అదిగో! / ఉత్తరం చదవకుండానే కంటతడి పెడుతున్నావ్!**
**నీ కన్నీటితో నా ఆశయాల అక్షరాలు చెరిగిపోనీకు**
**ఇంతకీ నీతో చెప్పకుండా**
**ఇల్లు వదిలి వెళ్ళిపోయానని కదూ నామీద కోపం?'**

ఆమె కన్నీటితో తన ఆశయాల అక్షరాలు చెరిగిపోనీయ వద్దని ప్రాధేయపడుతున్నాడు. ఆమెను వదిలి తాను వెళ్ళిపోయిన నాటి పరిస్థితిని గుర్తుకు తెస్తున్నాడు.

**'ఔను మరి,/ పట్టుమని పదిరోజులు కాలేదు / నువ్వు కాపురానికి వచ్చి / నీ చెక్కిలి ఎర్రగులాబీని ముద్దు పెట్టుకునే / పెళ్ళిబొట్టు తుమ్మెద ఇంకా ఎగరనేలేదు! పసుపు పాదాల మీద పారాణి తోరణాలు / ఇంకా చెదరనేలేదు!'** అప్పటికి అనతికాలంలోనే తమ వివాహం జరిగిందనే అంశాన్ని పై వాక్యాల్లో చెబుతున్నాడు. కేవలం పదిరోజులు కూడా కాలేదనే విషయాన్ని ఇలా చెబుతున్నాడు. ఆమె చెక్కిలిని ఎర్రగులాబీ గాను, దానిపై పెట్టిన నల్లని దిష్టి చుక్కను తుమ్మెదగాను వర్ణిస్తున్నాడు. 'పసుపు పాదాల మీద పారాణి తోరణాలు ఇంకా చెదరనేలేదు' అంటూ నవ వధువు వివాహ చిహ్నాలను గుర్తుకు తెస్తున్నాడు.

**'పగలు లోనికి రాకూడదని / పరదాలు పెట్టుకున్నాం / రాగబంధం సడలిపోరాదని /కంకణాలు కట్టుకున్నాం'**

ఇక్కడ 'పగలు' అనే మాటకు పగటి కాలం అనీ, రెండోది విరోధాలు అనే ద్వంద్వార్థంలో కవి ప్రయోగించాడు. అలాగే కంకణాలు కట్టుకోవడంలో ఉన్న నిబద్ధతను కూడా వెల్లడిస్తున్నాడు.

**'అయినా,**
**సూర్యుడు కిటికీలోనుంచి**
**తొంగిచూశాడు**
**శూరులు సుఖం కోసం**
**పుట్టలేదన్నాడు!'**

కిటికీలోంచి తొంగిచూసిన సూర్యుడే ఆదర్శాన్ని ప్రబోధిస్తు న్నాడు. శూరులు సుఖం కోసం పుట్టలేదనేది ఒక గొప్ప మానవతా సందేశం.



**'కళ్ళలో చిల్లులు పొడిచినా**
**చీకట్లను చీల్చడం మానలేదని**
**కాళ్ళు నలిగిపోయినా/ కళ్ళెం వదలలేదని**
**అనూరుణ్ణి ఆదర్శంగా చూపించాడు'**

సూర్యుని రథసారథి అనూరుడు. సూర్యుని ముందున్న అనూరునికి సూర్యకాంతి ప్రసరించక ముందే చీకట్లు కళ్ళకు తాకుతాయి. ఆ విషయాన్ని కవి కళ్ళలో చిల్లులు పొడిచినా అంటున్నాడు. అనూరుడికి ఊరువుల్లేవు కదా! అయినా ఆ విషయాన్ని కాళ్ళు నలిగిపోయినా అని ఓ సుగుణంగానే కవి చెబుతున్నాడు. అంటే దివ్యాంగుడు సైతం లోకంలోని చీకట్లను పారద్రోలే మహత్తర కార్యాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాడని అంతరార్థం.

**'తూటా లేని తుపాకి లాగ/ తొంభై ఏళ్ళు బ్రతకొద్దన్నాడు'** ఇది కూడా సూర్యుడు చేసిన మహాప్రభోదమే. ఆశయం లేని జీవితం నిరర్థకమని అంటున్నాడు.

**'ఆరాత్రే, / రిక్కల రెక్కల్ని విదిల్చుకుని**
**ఆకాశము నుండి అదృశ్యమైపోయాడు చంద్రుడు!'**

రిక్కలు అంటే చుక్కలు. రిక్కల రెక్కల్ని అంటే తన చుట్టూ అల్లుకున్న కుటుంబ బంధనాల్ని తెంపుకొని తాను ఇంటి నుండి నిష్క్రమించాడు అని. అతణ్ణే చంద్రుడిగా చెబుతున్నాడు కవి.

**'మళ్ళీ నేనింటికి వస్తే/ నన్ను గుర్తు పట్టగలవా? అని నా సందేహం'** అంటూ తాను ఇంటిపట్టున ఉన్నప్పటి రోజుల్ని గుర్తు చేస్తున్నాడు.

**'అప్పుడు,/ తడియారని బిడియంతో తలదించుకునేదానివి/ ఒకవేళ / నా చూపుల చకోరాలు నిన్ను చిలిపిగా పిలిస్తే మబ్బుతునకల్లాంటి సిగ్గుతెరలతో / ముఖబింబం కప్పుకునే దానివి'**

నునుసిగ్గుతో నూతన వధువు తలదించుకోవడం, తాను చూపులతో చిలిపిగా పిలిచినా సిగ్గుతో ముఖం కప్పుకోవడం, ఇవి తొలిప్రేమ చిహ్నాలు. తడియారని బిడియం, చూపుల చకోరాలు కవి సమయోచిత ప్రయోగాలు.

**'ఐనా, అప్పటిలాగా లేను నేను! / దరిద్ర దామోదరుల అశ్రు ప్రవాహ భారాన్ని /తలపై మోస్తున్నాను / క్షుధావ్యధిత హృదయాలలో కరడుగట్టిన /హాలాహలాన్ని మ్రింగాను'** పై చరణాల్లో ఆ వీరుడు కొన్ని సంకేతాల ద్వారా తన స్వరూపాన్ని తెలియజేస్తున్నాడు. దరిద్ర దామోదరులు అంటే నిరుపేదలు. వాళ్ల కన్నీళ్ళను తలపై మోస్తున్నానంటాడు. అలాగే ఆకలితో అల్లాడే వారి గుండెల్లో గూడు కట్టిన కాలకూట విషాన్ని అంటే వారి దుఃఖాన్ని తన గుండెల్లో నిలుపుకుంటున్నానని అంటున్నాడు.

**'రాబందులు పీల్చి, పిప్పిచేసిన / ఆశయాల కంకాళ మాలికను దాల్చాను / నరహంతల కరాళ పదఘట్టనలో నలిగి /పైకి రేగిన అనాథ ధూళికణాల విభూతిని పూసుకున్నాను'** ధనస్వామ్య భూస్వామ్య వ్యవస్థల అవశేషాలనే రాబందుల గానూ, నాశనం చేసిన ఆశయాలను కంకాళ్ల మాలికలుగాను ఇక్కడ వర్ణింపబడ్డాయి. అంతేకాదు ఆ నరహంతకుల పాదాల కింద నలిగిపోయిన అనాథులే ధూళికణాలు గాను, ఆ విభూతినే తన ఒళ్లంతా పూసుకున్నానని చెబుతున్నాడు ఆ వీరుడు. అంటే వారికి జరిగిన అన్యాయాలకు తగిన మూల్యం చెల్లించేలా చేస్తున్నానంటున్నాడు. పై వాక్యాలను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, వాటి వెనుక కొన్ని భావ చిత్రాలు మనకు గోచరిస్తాయి. అశ్రు ప్రవాహ భారం అంటే తలపై గంగను దాల్చి, కంఠంలో హాలాహలం నిలిపి, మెడలో కంకాళ మాలికను దాల్చి, ఒంటికి చితాభస్మాన్ని పులుముకున్న పరమశివుని స్వరూపం మనకు లీలగా ద్యోతకమౌతుంది. శివుడు సంహర్త కదా! నరుడే శివుడయ్యాడు ఈనాడు.

**'మరి ఇక్కడి విశేషాలు / నేనింటికి వచ్చేవరకూ సశేషాలు కళ్ళకు రోకటి పోటు లాంటి చీకటి /అతిగాఢంగా కౌగిలించే చలి, నా నెచ్చెలి / నిరంతరం అభిషేకించే మంచు /ముడుచుకునే గుండెల్లో కొరకంచు'**తనకు యుద్ధభూమిలో ఎదురయ్యే ప్రతికూల వాతావరణాన్ని వర్ణిస్తున్నాడు. కళ్ళకు కటిక చీకటి, ఒంటిని గజగజలాడించే చలి, గుండెల్ని కొరకంచులా దహించే పైనుండి కురిసే మంచు.

**'లోయకీ పర్వతానికీ / భేదం కనిపించదిక్కడ / ఆకలి, చీకటి, భయం, చావు / మా నిఘంటువులో లేని పదాలు'** ఎక్కడ ఎత్తు పల్లాల ప్రక్తే ఉండదు. దేన్నైనా దాటుకొని వెళ్ళాలి. ఆకలి, చీకటి, భయం, చావు వంటి అతి క్రూరమైన పదాల అర్థాలతో మాకు పని లేదు. అంటూ అద్భుతమైన సత్యాన్ని ఇక్కడ ఆవిష్కరిస్తున్నాడు.


**'నేను ట్రిగ్గర్ నొక్కే శబ్దం / మళ్ళీ నాకు వినిపించడమే నేను బ్రతికున్నాననడానికి సాక్ష్యం!'**

గన్ పేల్చుతున్నప్పుడు 'ట్రిగ్గర్' అంటే తుపాకీ మీట నొక్కగా ఆ శబ్దం మళ్ళీ తన చెవులకు వినిపిస్తే తాను ఇంకా బ్రతికున్నానని తనకు నిర్ధారణ ఔతుందట. అంటే ఆ వీరుల ప్రాణాలు ఎంత అనిశ్చితాలో, క్షణికాలో తెలుస్తోంది.

**పిల్లా తిరుపతిరావు%ా7095184846**

(మిగతా వచ్చేవారం)

# సూర్య బుడత



## బాలల కథ

# ఒకపూవు కథ



ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు బంగారు బొమ్మలాంటి ఒక చక్కని కూతురుంది. ఆ పాపంటే ఆయనకు చానా ఇష్టం. చిన్నప్పట్నించీ ప్రేమగా ఏదడిగితే అది కొనిస్తా పెంచి పెద్ద చేసినాడు. పెద్దగైనాక పెండ్లి చేయాల గదా. దాంతో మంచి మంచి సంబంధాలు తేవడం మొదలు పెట్టినాడు. కానీ ఎన్ని సంబంధాలు తెచ్చినా ఆమె నాకు నచ్చలేదంటే నాకు నచ్చలేదంటా ఎగరగొట్టడం మొదలు పెట్టింది. దాంతో ఆయన బాగా విసిగిపోయినాడు. ఒకరోజు కూతుర్ని పిలిచి "ఏందమ్మా... నేనే సంబంధం తెచ్చినా నచ్చడం లేదంటున్నావ్. అసలు నీకు ఎట్లాంటోడు కావాల్నో చెప్పు... తెచ్చి చేస్తా" అన్నాడు.

అప్పుడామె నెమ్మదిగా "నాన్నా... నాన్నా... నాకు ఈ లోకానికంతా శక్తినిచ్చి వెలుగులు పంచే సూరీడంటే చానా చానా ఇష్టం. నన్ను ఎట్లాగైనా ఆయనకిచ్చి పెండ్లి చేయవా" అనడిగింది.

అప్పుడు వాళ్ళ నాయన "చూడమ్మా... సూర్యునితో పెండ్లంటే మాటలు గాదు. ఆయనెక్కడో ఆకాశంలో తిరుగుతా వుంటాడు. మనముండేదా భూమ్మీద. మనకూ ఆయనకూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఆ సంబంధం కుదిరే పని కాదుగానీ వేరేవాన్ని చేస్కో" అన్నాడు.

కానీ... ఆమె వాళ్ళ నాయన మాట వినిపిచ్చుకోకుండా... "పెండ్లంటూ చేస్కుంటే సూర్యున్నే చేసుకుంటా... లేదంటే లేదు" అని మొండిపట్టు పట్టి కూర్చోనింది.

ఎంత నచ్చచెప్పినా వినకపోయేసరికి వాళ్ళ నాయనకు తెగ కోపమొచ్చేసి "నామాట విననప్పుడు... ఈడెందుకున్నావ్. ఫో... నా దగ్గరనుంచి" అని ఆమెను ఇంట్లోనుంచి దొబ్బేసినాడు..

ఆమె "సూర్యున్ని ఎట్లా పెండ్లి చేసుకోవాలబ్బా" అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... పడమటి దిక్కున బయలుదేరి అడవులు, గుట్టలు, వాగులు, వంకలు, ఒకొక్కటే దాటుకుంటా దాటుకుంటా ఒక పెద్ద కొండపైకి ఎక్కింది. ఆ కొండపైన ఒక ఇల్లుంది. ఆ ఇంట్లో ఒక ముసలామె వుంది. ఆమె ఆ రాకుమారిని చూసి "ఏందమ్మా పాపం... ఒక్కదానివే అట్లా తిరుగుతా వున్నావ్. ఏం కావాల నీకు" అనడిగింది. అప్పుడా రాకుమారి కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే జరిగిందంతా చెప్పింది.

అప్పుడా ముసిలామె చీరకొంగుతో ఆమె కండ్లనీళ్ళు తుడుస్తా "నువ్వేమీ బాధ పడొద్దు. నువ్వు వెతికే సూరీడు ఎవరోగాదు నా కొడుకే. ఆకాశంలో పగలంతా తిరిగి తిరిగి అలసిపోయి రాత్రి కాగానే ఇంటికొస్తాడు. నువ్వు నాకెంతగానో నచ్చినావు. నే చెప్తాలే. నా కొడుకుని చేసుకుందువు గానీ" అనింది. దానికామె చానా సంబరపడింది.

సూరీడు ఆకాశంలో పగలంతా తిరిగి తిరిగి అలసిపోయి రాత్రి కాగానే ఇంటికి తిరిగి వచ్చినాడు. ఇంట్లో రాకుమారిని చూసి "ఎవరబ్బా... ఈ అమ్మాయి. మా ఇంట్లో వుంది" అనుకున్నాడు. అంతలో ఆ రాకుమారి సంబరంగా సూర్యుని దగ్గరికి వచ్చి "నువ్వంటే నాకెంతో ఇష్టం. నీకోసం అందర్నీ వదిలి వచ్చేసినా. ఇప్పుడు నువ్వు తప్ప నాకింకెవరూ లేరు. నన్ను పెండ్లి చేసుకోవా" అనడిగింది.

దానికి సూర్యుడు "చూడు పాపా... నేను మీ లెక్క మామూలు మనిషిని కాదు. ఎప్పుడూ భగభగా మండిపోతా సెగలు కక్కుతా వుంటాను. నన్ను కండ్లు తెరిచి సూటిగా చూస్తే సాలు... ఎవరి కండ్లకైనా సరే మబ్బులు కమ్ముతాయి. నన్ను ముట్టుకుంటే చాలు కాలి బూడిదైపోతారు. అట్లాంటిది నువ్వు నన్నెట్లా పెండ్లి చేసుకోగలవ్. పో... పోయి మీ అమ్మా నాన్న చూపిచ్చిన సంబంధం చేసుకోని హాయిగా వుండుపో అన్నాడు.


కానీ ఆమె ఆ మాటలేమీ పట్టిచ్చుకోకుండా "లేదు... నేను నిన్ను తప్ప ఎవ్వరినీ పెండ్లి చేసుకోను. నన్ను చేసుకుంటావా... చేసుకోవా..." అని పట్టుపట్టి కూచోనింది.


ఎంత చెప్పినా వినకపోయేసరికి సూర్యునికి కోపమొచ్చేసి "పెండ్లీ లేదు... గిండ్లీ లేదూ... ఫో... నా ఇంట్లోంచి" అని ఆమెని బైటికి దొబ్బి తలుపేసేసినాడు. పాపం ఆమె ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా ఆకాశంలో తిరిగే సూర్యున్నే చూస్తా చూస్తా ఏమీ తినకుండా కొద్ది రోజులకు చచ్చిపోయింది.

ఆమె ఎక్కడైతే చచ్చిపోయిందో సరిగ్గా అక్కన్నే కొంత కాలానికి మళ్ళా ఒక మొక్కై పుట్టింది. అది కొంతకాలానికి పెరిగి పెద్దగై ఒక పూవు పూసింది. ఆ పూవు ఎట్లుందంటే అరచేయంత పెద్దగా చందమామ లెక్క గుండ్రంగా పసుప్పచ్చని రేకులతో చూడముచ్చటగా వుంది.

ఆరోజు నుండీ ఆ పూవు ఏనాటికైనా సూర్యుడు మళ్ళా రాకపోతాడా... నన్ను పెండ్లి చేసుకోకపోతాడా అని పొద్దున్నే సూర్యుడు ఆకాశంలో కనబడ్డం మొదలు మరలా సాయంత్రం మాయమయ్యేవరకూ సూర్యునికెళ్లే ఆశగా చూస్తా... సూర్యుడు ఎటువైపు తిరిగితే అటువైపు తిరుగుతా వుంది. ఆ పువ్వునే మనం పొద్దుతిరుగుడు పువ్వనీ, సూర్యకాంతమనీ పిలుస్తావుంటే ఆంగ్లభాషలో 'సన్ ఫ్లవర్' అంటుంటారు.

**డా.ఎం.హరికిషన్-కర్నూలు-9441032212**






| | | | |
|---|---|---|---|
| | 3 | 2 | |
| | | | 4 |
| 1 | | | |
| | | 1 | 2 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 1 | |
| | 2 | 4 | |
| | | 2 | 1 |

| | | | |
|---|---|---|---|
| 2 | 4 | | 3 |
| | | | |
| | 3 | 4 | |
| | | | 1 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 4 | |
| | 1 | 2 | |
| 2 | | | 3 |

EDCRAFT

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | | 4 | |
| | 1 | 2 | |
| 2 | | | 3 |

| | | | |
|---|---|---|---|
| 4 | | | |
| | 3 | 4 | |
| | 4 | 3 | |
| | 1 | | 4 |

| | | | |
|---|---|---|---|
| | | 1 | 2 |
| 2 | | | |
| | | | 4 |
| 4 | 3 | | |



## WINTER

| | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| F | P | A | M | O | T | I | U | S | W | O | N | S | Q | B | S |
| R | X | G | O | Y | D | S | H | O | V | E | L | Z | J | N | C |
| Q | T | L | B | N | K | L | W | R | S | M | A | G | O | U | F |
| V | G | S | R | A | P | E | N | G | U | I | N | W | Y | H | D |
| I | W | N | T | E | J | G | X | M | Q | S | B | R | E | O | Z |
| U | C | E | A | Y | T | N | D | P | I | O | H | F | K | L | R |
| M | S | I | Z | G | Q | A | V | B | A | T | L | X | C | I | J |
| Y | H | K | C | F | G | W | E | R | N | U | T | P | O | D | G |
| S | J | M | V | L | S | O | D | W | R | X | Q | E | H | A | N |
| E | N | T | G | K | E | N | B | R | S | F | M | C | N | Y | I |
| V | L | O | I | N | H | S | I | O | X | J | U | Q | A | S | D |
| O | F | I | W | P | E | E | R | S | T | O | O | B | M | C | D |
| L | N | X | U | B | S | Z | J | Y | P | N | I | H | W | K | E |
| G | I | P | E | T | A | L | O | C | O | H | C | T | O | H | L |
| B | S | C | A | R | F | L | D | R | E | M | Z | U | N | J | S |
| H | R | E | T | N | I | W | L | X | F | P | G | Y | S | O | K |



| | | | |
|---|---|---|---|
| boots | hot chocolate | shovel | snowboard |
| flurries | icicle | skates | snowman |
| frozen | igloo | skiing | snowsuit |
| gloves | mittens | sledding | sweater |
| hockey | penguin | snow angels | toboggan |
| holidays | scarf | snowball | winter |

# సంతోషమే జీవితంగా మారాలంటే



ప్రపంచ వ్యాప్తంగా రానే వచ్చింది మార్చి 20. అంతర్జాతీయ సంతోష దినోత్సవం మోసుకొచ్చే ఉత్సాహం.. ఉల్లాసం. ఈ ఉత్సాహం రోజులు గడిచేకొద్దీ కరిగిపోకుండా ఉండేందుకు, ఈ సంతోషం కాలంతోపాటే కరిగిపోకుండా ఉండేందుకు, జీవితాంతం ఇంతే ఆనందంగా ఉంటే ఎంతో బాగుంటుంది కదా! కచ్చితంగా ఉంచుకోవచ్చు. మన సంతోషం పూర్తిగా మన చేతుల్లోనే వుంటుంది. సంతోషమే సంపూర్ణబలం అనే నానుడి మనకందరికి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితులను ప్రపంచంలోని ప్రజలను పరిశీలించి చూసినట్లయితే సంతోషంగా ఉన్నవాళ్లే సంపూర్ణ జీవితాన్ని అనుభవించగలుగు తున్నారు. ఉదయం లేచినప్పటినుండి పడుకునేంత వరకు, పలకరింపు నుంచి మొదలుకొని వీడ్కోలు చెప్పేంత వరకూ.. ప్రతిదీ మన సంతోషానికే. ఈ రోజునుండే మన జీవితాలను మరింత సంతోషభరితం చేసుకుందాం. ఎలాంటి పరిస్థితులలో కూడా ఆనందాన్ని మరచిపోకూడదు. కాలాన్ని వ్యర్థం చేసుకోకుండా, ప్రతి క్షణాన్ని ఆనందమయం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనిషి జీవితంలో ఆనందం అనేది చాలా ముఖ్యం. ఎన్ని ఒత్తుడులు, సమస్యలు ఉన్నా.. వాటిని మరిచి ఆనందంగా జీవించాలి

**సంతోషంగా ఉంటే నిండు నూరేళ్లు**

ఒకప్పటి మన తాతలు, అమ్మలు సంతోషమే సగం బలం అనేడి వారు కానీ ప్రస్తుతం సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ, ఆధునిక యుగంలో కాలంతో పాటు పడుతూ ఉరుకుల పరుగుల జీవితాన్ని అనుభవిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులల్లో సంతోషం అనేది కర–ువైపోయిందా అని అనిపిస్తుంది. అందుకేనోమే ప్రస్తుత పరిస్థితులలో సంతోషమే సంపూర్ణ బలం. జీవితం అత్యంత ముఖ్యమైనది. సంతోషంతోటే నిండు నూరేళ్లు. ఒక్క రోజులో ఉదయాన్నే నిద్ర లేచిన మొదలు ఆ రోజుకు ఏదోక అర్థం, సార్థకత, ప్రత్యేకత ఉండాల్సిందే. ప్రతి రోజులో నేను ఎలా గడిపాను అని విశ్లేషణ చేసుకుంటూ ఉండాలి. సంతోషంగా గడపడానికి ప్రతి రోజులో కొంత సమయాన్ని ఖచ్చితంగా కెటాయించుకోవాలి. ఈ సంతోష సమయం మిగిలిన సమయాన్ని కూడా సంతోషంగా జీవించడానికి దోహదం చేస్తుంది.ప్రతి పనిని అంకిత భావంతో పని చేయాలి. ప్రతి ఫలం సానుకూలంగా ఉన్నా, ఉండకపోయిన మన శక్తి సామర్థ్యాల మేరకు ఇష్టంగా పని చేయాలి. ఉదయం లేచినప్పటి నుండి పడుకునేంత వరకు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటాం. ఆ పని మంచిగా జరిగి ఫలితం బాగుంటే సంతోషమే కదా. సంతోషంగా ఉంటే నిండు నూరేల్లు జీవించే అవకాశం ఎక్కువ.

**సంతోషం తో ఆయుష్షు పెరుగుతుందా:**

నిండు నూరేళ్లు బ్రతుకుతామని నమ్మే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ప్రతి రోజు ఒత్తిడితో జీవితం గడుపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నిండు నూరేళ్లు జీవిస్తున్న వారిలో ఉన్న శక్తి ఏమిటి? మనకి కూడా నిండు నూరేళ్ల జీవితం సాధ్యమవుతుందా. ఎంతోమందికి సాధ్యమైంది మనకెందు క్కాదు. నలుగురితో కలసి మెలసి జీవించినంత మాత్రానా ఆయుష్షు పెరుగుతుందా? అవును సాధ్యమే అని సర్వేలు చెబుతున్నాయి. చుట్టూ ఉండే సమాజంతో మమేకమవుతూ, నలుగురితో కలిసిమెలిసి జీవించడం ద్వారా మన ఆయుర్దాయాన్ని కొన్నేళ్లపాటు పొడిగించుకోవచ్చు. కుటుంబ సభ్యులు, మిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసి పోవడం, మనకు తెలియకుండానే మనలో భద్రతాభావం, మానసిక సంతృప్తి ఏర్పడటం జరుగుతుంది. ఒంటరిగా కాలం వెళ్లదీసేవారి కంటే, నలుగురితో కలివిడిగా మాట్లాడుతూ కలిసి జీవించేవారి యొక్క ఆయుర్దాయమే ఎక్కువే. మనం చేసేపని, మనం తినే ఆహారం, ఉపయోగించే వస్తువులతో పాటూ, తమ అలవాట్ల పట్లా చాలా సంతృప్తితో ఉన్న వారి యొక్క ఆయుష్షు ఎక్కువగానే ఉంటోంది. ప్రతి విషయంలో ఒత్తిడి కలగడానికి ప్రధాన కారణం ఆ పనిలో సంతృప్తి కలగకపోవడమే. తృప్తి భావనతో ఉండటం వల్ల మానసిక ఒత్తిళ్లు చాలా వరకు దూరమైపోతాయి. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వాటంతట అవే సర్దుకుపోతాయి

**నవ్వితే చాలు**

ప్రతి రోజు ఒకే టైం టేబుల్ . అయ్యో ఇంతేనా జీవితమంటే అని అనిపిస్తూ ఉంటుంది. జీవితం అంటే విసుగు వస్తోంది. జీవితం ఎప్పుడూ ఆసక్తిగా, ఉత్సాహంగా ఉండాలంటే..రోటిన్ కు భిన్నంగా ఆలోచనలు మొదలు కావాల్సిందే. వారాంతపు సెలవులలో యాత్రలు, సముద్ర ప్రయానాలు, కొత్త కొత్త ప్రదేశాలను చూసి రావడం, కొత్త కొత్త అభిరుచుల్లో మునిగితేలడం లాంటివి చేస్తుండాలి.చిత్రలేఖనం, సంగీతం వంటి వాటితో కూడ సంతోష మయమైన జీవితాన్ని పొందవచ్చు. నవ్వించడం ఒక భోగం. నవ్వకపోవడం ఒక రోగం అన్న నానుడి తెలిసిందే. మనస్ఫూర్తిగా నవ్వుకోవడం వల్ల శరీరం అంతా ఆక్టివ్ గా మారుతుంది. మనస్ఫూర్తిగా నవ్వితే చాలు ఒత్తిళ్లన్నీ పటాపంచఌలయితాయి.

**ఇవ్వడంలోనే ఆనందం:**

సుఖదు:ఖాలు నాణేనికి బొమ్మ బొరుసు లాంటివి. సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. సాధ్యం కానిది అంటూ ఏదీ లేదు. ప్రతి అంశాన్ని గుర్తుంచుకొని వాటిని ఉపయోగించుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలి. సృష్టిలో పనికి రానిదంటూ ఏదీ ఉండదు. మనం చూసే విధానంలోనే తేడా ఉంటుంది. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి. ఇతరులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి. తాము సంతోషంగా ఉండటమే కాకుండా చుట్టూ ఉన్నవారినీ ఆనందంగా ఉంచాలి. తీసుకోవడం కంటే ఇవ్వడంలోనే ఆనందం ఉంటుంది. అందుకే కానుకలు, అభినందనలు, ఆశ్చర్యకర సందేశాల ద్వారా ఇతరులను సంతోష పెట్టేందుకు ప్రయత్నించాలి. అలాగే అవసరంలో ఉన్నవారికి సాయపడాలి. వారికి అవసరమైనప్పుడు ఆహారం లేదా నగదు ఇస్తే ప్రపంచంలో అంతకంటే ఆనందం మరొకటి ఉండదు.

**సంతోషమే జీవితంగా మారాలంటే:**

ప్రతి రోజు ఆక్టివ్ గా ఉండవలెను.ఉరుకులు పరుగులు తగ్గించుకోవాలి. ప్రతి నిమిషాన్నీ సావధానంగానే గడపడానికి ప్రయత్నించాలి. ఏదైనా తినేటపుడు 20% కడుపులో వెలితిగా ఉంచాలి. కడుపులో 80% నిండే వరకూ మాత్రమే తినాలి. ఖాళీ సమయాన్ని మంచి మిత్రుల మధ్యలోనే గడపాలి. ప్రతి రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ఇతరుల పట్ల నవ్వుతూ, సద్భావంతో ఉండాలి. ఏ.సి. గదులలో కంటే నేచురల్ గా ఉండే ప్రదేశంలో సమయంను గడపాలి. మనం ఇతరుల నుండి పొందే ప్రతి సాయానికీ వారికి థ్యాంక్స్ చెప్పాలి. భూత, భవిష్యత్తులో కంటే వర్తమానంలో ఈ క్షణం లోనే జీవించాలి ఆలోచించాలి. సానుకూల ఆలోచనలతో సంతోషం. మనదగ్గరున్న దానితోటే సంతృప్తి చెందాలి. అందని దానిగురించి ఆలోచించడం ఆశించడం వల్ల భంగపాటు తప్పదు.ఇతరులతో సత్సంబంధాలను కలిగి ఉండాలి. ప్రతి విషయాన్ని సీరియస్ గా తీసుకోకూడదు. బాధ పడకూడదు.

**డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి**
**జాతీయ అధ్యక్షుడు**
**అసోసియేషన్ ఆఫ్ రిహాబిలిటేషన్**
**సైకాలజిస్ట్ అండ్ ప్రొఫెషనల్స్ ఇండియా**
**970393532**



## భరోసా

భయమెందుకే నీకు ఓ బంగారుతల్లి
తెలతెలవారగానేజి
ప్రభాతసూర్యుని తొలికిరణం
నీకు తోడుంటానంటుంది
అలుకు చల్లిన ఇంటి వాకిలి
ధైర్యం ముగ్గేయమంటోంది...
కొండపైనుంచి వినిపిస్తోన్న ఘంటానాదం
మంచి ఆకాంక్షిస్తున్న ఒక స్తోత్రం,
అల్లంత దూరాన ఏకమైన ప్రార్థన –
నీ క్షేమానికి భరోసా తాముంటామంటోంది...
రాతిరి వేళన వెన్నెలంత ఆకాశం
చందురుని నీ కూడా తోడు వెళ్లమంటోంది....
లేవమ్మా చిట్టితల్లి...
చరిత కెక్కిన వీరమాతలు
నింగిన చుక్కలు వీరనారీమణులు
నీకెపుడూ కాపుంటారు తల్లీ...
ఎడమకాలితో భయాన్ని తన్నేయగలవ్...
నిను నిలువరించే మగరక్కసిమూకల నెదిరించగలవ్
ధైర్యం నీ ఆయుధం ఆదిపరాశక్తి ప్రతిరూపం



అదిగదిగో అనంత అవకాశాల సుందర ప్రపంచం
ఆకాశమే హద్దుగా హాయిగా కలల రెక్కల కట్టుకో...


**– అశోక్ గుంటుక**
**9908144099**

# ఆయుర్దాయం

"శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి" అనేది వేద పురుష ఆశీర్వచనం. మనలను నిండా నూరేళ్ళు బ్రతకమని వేదం ఆశీర్వదిస్తోంది. వేద మంత్రానికి ఉన్న శక్తి గొప్పది కాబట్టి వేదజ్ఞులైన పెద్దలకు నమస్కరించి వారిచే ఈ ఆశీర్వచనం పొందుతూ ఉంటాం. అలాగే నిత్యం చేసుకొనే సూర్యోపస్థానంలో "పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం, నందామ శరదశ్శతం, మోదామ శరదశ్శతం" అని చెప్పబడింది. "నిండు నూరేళ్ళ ఆ సూర్యుని చూడగలగాలి. నిండా నూరేళ్ళు జీవించాలి. అది కూడ ఆనందంగా జీవించాలి" అని ఆకాంక్షిస్తాం. ఇలా ఆకాంక్షించటంలో ఎంతో విలువ ఉంది. "గుడ్ మార్నింగ్" అని చెప్పడం, "గుడ్ నైట్" చెప్పటంలోనూ లౌకికంగా కూడ అట్టి ఆకాంక్షలు ఆధునిక కాలంలోనూ అనుసరిస్తూనే ఉన్నాం. మంచి మనస్సు నుండి వచ్చే శుభాశీస్సుకు, శుభాకాంక్షాలకు కూడ శక్తి ఉంది. దాని వలన మేలూ జరుగుతుంది. ఇది పూర్వకాలపు విషయమే కాదు, నేటి విషయం కూడా అని అర్థం చేసుకొనగలం.

"బ్రతికి యుండిన శుభములు బడయవచ్చు" కాబట్టి బ్రతికి ఉండటం అంటే ఆయుర్దాయం మొదట కోరదగినది. అందుకే ఏ పూజ చేసినా సంకల్పంలో ఆయురారోగ్య భోగభాగ్యాలు కాంక్షిస్తాం. అందులో ముందు కోరేది ఆయుర్దాయాన్నే. కోట్ల సంపద లభించినా ఆయుర్దాయం లేక మరుసటి రోజే మరణించే వానికి ఈ కోట్ల సంపద వలన ప్రయోజనమేమిటి? అందువలనే మొదట కోరదగినది ఆయుర్దాయం. నిజమే. ఆయుర్దాయమనేది కోరుకొంటే వచ్చేదా? అనేది ప్రశ్న. "దీర్ఘాయుష్మాన్ భవ" అని దీవించటం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందా? అని సందేహం.

**ఆయుః కర్మ చ విత్తం చ విద్యా నిధన మేవ |**



**పంచైతా న్యపి సృజ్యంతే గర్భస్థస్యైవ దేహినః ||**

అని చెప్పబడింది. అంటే "ఆయుష్షు, వృత్తి, ధనం, విద్య, చావు అనేవి ఐదూ జీవి గర్భంలో ఉండగానే నిర్ణయింపబడుతూ ఉంటా"యని దాని అర్థం. ఆయుర్దాయం, మరణం అనేవి ముందే నిర్ణయింపబడితే ఇంకా ఈ ఆశీస్సుల వల్ల కాని, మరే జాగ్రత్తల వల్ల కాని ప్రయోజనమేమిటని ప్రశ్న. "లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే" నుదుట వ్రాసిపెట్టినది ఎవరూ తుడవలేరని, మార్చలేరని, జరిగి తీరుతుందని మరికొందరి మాట. "ఏది నిజం" మనేది సామాన్యునకు వచ్చే ప్రశ్న. ఆయుష్షుకు వృద్ధి, క్షీణతలు ఉంటాయా? ఉంటేనే దాని విషయంలో జాగ్రత్తలు తీసుకొనటం అవసరం తప్ప అదేమీ లేనప్పుడా యత్నమే వ్యర్థం కదా! ఆయుర్వేదం అనే వైద్య విధానం పేరులోనే ఆయువు ఉన్నది. ఆయుర్వేదమనేది ఊసుపోక చెప్పిన సామాన్యపు మాట కాదు. వేదాలలో మొదటిదైన ఋగ్వేదానికి సంబంధించిన ఉపవేదమే ఆయుర్వేదం. అంటే ఆయువును గూర్చి తెలిసికొనదగిన విజ్ఞానం అది. అందువల్ల ఆయువునకు సంబంధించి వృద్ధి క్షయాలు కూడ పరిగణింపదగినవే అని తెలుస్తుంది.

లలాట లిఖితమైన ఆయుర్దాయాన్ని ఎవ్వరూ మార్చలేరనేది యదార్థమైనా మార్కండేయుడు, శంకరాచార్యుల వారు మొదలైన వారు దైవానుగ్రహం వలన ఆయుర్దాయాన్ని పెంచుకొనటం చూస్తాం. అంతే కాదు హనుమంతుడు, విభీషణుడు మొదలగు వారు చిరంజీవులుగా పరమందటమూ చూస్తాం. ఇంకా విశేషం ద్వాపర యుగంలో చనిపోయిన సాందీపని గురువు యొక్క పుత్రుని శ్రీకృష్ణుడు బ్రతికించినట్లు, త్రేతాయుగంలో చనిపోయిన వానర వీరుదు గంధమాదనుని హనుమంతుడు బ్రతికించి తెచ్చినట్లు కూడ ఇతిహాసాల ద్వారా తెలిసికొన్నాం. కాబట్టి దైవానుగ్రహం వలన కాని, అమోఘవచనులైన ఋష్యాదుల ఆశీర్వచనాల వల్ల కాని ఆయుర్దాయం పెంచుకొనటం సాధ్యమే అని తెలుస్తుంది. కాబట్టే మన పూర్వజులు "ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థం" అని సంకల్పంలో చెప్పుకొనటంలో అనౌచిత్యం లేదని, "శతమానం భవతి" అంటూ మహనీయుల ఆశీస్సులు పొందటం శ్రేయస్కరమే అని తెలుస్తుంది. అందుకే అట్టి ఆశీర్వచనాల కోసం పెద్దల యెడ వినయ విధేయతలతో ఉండాలి.

**(ఈ వ్యాసం అరణ్యస్పందన నుండి గ్రహించబడినది. ఆకాశవాణి విజయవాడ కేంద్రం సౌజన్యంతో డా||అన్నదానం చిదంబర శాస్త్రి గారు వ్రాసారు)**

---

# పంచ నారసింహుల పవిత్రక్షేత్రం

నాడు అమిత భక్తితో ప్రత్యక్షం చేసుకున్న యాదరుషికే కాదు, నేడు అశేష భక్త జనులకు కూడా ఆశీస్సులు అందిస్తున్న భక్త వరదుడు యాదాద్రి లక్ష్మీనారసింహుడు. ఆయన ఈ క్షేత్రంలో అయిదు రూపాల్లో వెలసి అఖిల జనావళికి అభయప్రదాతగా నిలుస్తున్నాడు. ఆ స్వామి రూపమే భీకరం. కానీ హృదయం మహా మృదులం.

మార్చి 18 యాదాద్రి నరసింహుని కళ్యాణోత్సవం, 19 స్వామివారి రథోత్సవం

రుష్యశృంగుని పుత్రుడైన యాదరుషి తపోఫలంగా నరసింహస్వామి పరమ ప్రేమతో ప్రత్యక్షమైన క్షేత్రమే యాదగిరిగుట్ట. పంచ నరసింహ క్షేత్రంగానూ ప్రసిద్ధి. ఈ కొండపై స్వామి జ్వాలా నరసింహ, గండ భేరుండ నరసింహ, యోగ నరసింహ, ఉగ్ర నరసింహ, లక్ష్మీనరసింహగా దర్శనమివ్వటం విశేషం. యాదాద్రిని 'రుషి ఆరాధన క్షేత్రం' అని కూడా అంటారు. ఆంజనేయుడు ఇక్కడ క్షేత్రపాలకుడు. యాదగిరి శిఖరాగ్రంలో ఈశాన్య దిశలో పరమశివుడు స్వయంభూలింగంగా వెలిశాడు. అందుకే ఇది వైష్ణవులూ, శైవులకూ కూడా ఆరాధ్యనీయమైన తీర్థం.

**యాదర్షి పేరిటే యాదాద్రి**

పురాణ కథలను అనుసరించి బాల్యం నుంచే యాదర్షి నృసింహభక్తుడు. ఒకసారి తీర్థయాత్రలు చేస్తుండగా ఆంజనేయుడు కలలో కనిపించి అడవి మధ్యలో ఉన్న పర్వతం దగ్గర తపస్సు చేయమని ఆదేశించాడు. హనుమ సూచన మేరకు కొండ దిగువన తన ఇష్టదైవమైన నరసింహుని ధ్యానిస్తూ, ఎన్నో ఏళ్ళ తపస్సు చేశాడు. అలా తపస్సు చేసింది ఈ పరిసర ప్రాంతంలోనే అని భక్తుల నమ్మకం. యాదముని తపస్సుకు మెచ్చిన స్వామి ఉగ్రనరసింహ రూపంలో సాక్షాత్కరించాడు. ఆ మూర్తిని దర్శించలేని ముని, శాంతరూపంలో కనిపించమని ప్రార్థించగా లక్ష్మీసమేతుడై ప్రత్యక్షమయ్యాడు. యాదర్షి కోరిక మేరకు 12 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవైన గుహలో స్వయంభువుగా వెలిశాడు. అదే లక్ష్మీనరసింహుని రూపం. ఇక్కడ శంఖుచక్రాలు, అభయ వరద ముద్రలతో స్వామి శోభిల్లడం విశేషం. ఆ గిరి తన భక్తుడైన యాదరుషి పేరుమీదుగా యాదగిరిగా ప్రసిద్ధమవుతుందని నృసింహుడు ఆశీర్వదించాడు. అదే యాదగిరిగుట్ట. యాదర్షి ప్రార్థన మేరకు ఆంజనేయస్వామి కూడా పంచముఖాలతో క్షేత్రపాలకుడిగా వెలిశాడు.

**అయిదు రూపాల అపురూప దర్శనం**

నరసింహస్వామిలోని బహు ముఖాలను దర్శించాలని ఆకాంక్షించి యాదముని తీవ్ర తపస్సు చేశాడు. భక్తులను కరుణించే నృసింహుడు



మరోసారి దర్శనమిచ్చి ముని అభీష్టాన్ని నెరవేర్చి, తనలోని మరో నాలుగు దివ్యరూపాలను దర్శింపచేశాడు. అవే జ్వాల, ఉగ్ర, గండభేరుండ, యోగనృసింహ రూపాలు. లక్ష్మీ నరసింహ రూపంతో కలిపి పంచముఖ మూర్తులతో నరహరి యాదాద్రిపై భక్తుల మనోభీష్టాలను తీరుస్తున్నాడు. సాధారణంగా సౌమ్య, భోగమూర్తులను (సీతారాములు తదితర సతీసమేతులైన మూర్తులు) జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రతిష్ఠించి పూజిస్తారు. ఉగ్ర, యోగమూర్తులను కొండలపైన, అరణ్యాల్లో ప్రతిష్ఠాపన చేస్తారు. కానీ నరసింహుని సర్వ మూర్తులను ఒకేచోట పూజించటం యాదాద్రి విశిష్టత. ఆలయంలో జ్వాలా నరసింహుడు పాము పడగలా, ఎగసిన అగ్నికీలలా ఉంటాడు. అలాగే ధ్యానస్థితిలో యోగనరసింహుడు, వెండి కవచంతో ఉన్న లక్ష్మీనరసింహస్వామి, ఉత్సవ మూర్తులు, గండభేరుండ నారసింహుడు, చక్రనారసింహుడు కనిపిస్తారు

**కొన్నాళ్లు మరుగున పడినా..**

యాదముని నరహరిని అర్చిస్తూ యాదగిరిపైనే తనువు చాలించి, స్వామిలోనే ఐక్యమయ్యాడు. కాలక్రమంలో ఈ క్షేత్రం ధూపదీప నైవేద్యాలు లేని కోవెలగా మారింది. కొన్నేళ్ల తర్వాత సమీప గ్రామాధికారికి నృసింహుడు కలలో కనిపించి, తన జాడలు తెలియజేశాడు. మరుసటి రోజు భక్తులతో కలిసి కొండపై అన్వేషించగా తొలుత విష్ణు పుష్కరిణి, తర్వాత ఆంజనేయస్వామి మూర్తి, చీకటి గుహలో పంచనారసింహుల రూపాలు కనిపించాయి. అప్పటి నుంచి స్వామికి పూజలు చేయసాగారు. స్థల పురాణాన్ని బట్టి త్రిభువన మల్లుడనే పశ్చిమ చాళుక్య రాజు ఈ లక్ష్మీనరసింహుని అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. అతడు తన మంత్రి ద్వారా ఆ స్వామి మహిమను తెలుసుకుని పూజలు నిర్వహించాడు. తరవాత నరసింహుని కృపతో ఎన్నో యుద్ధాల్లో విజయం సాధించాడు. యాదగిరీశుడిని కాకతీయ గణపతిదేవుడు, శ్రీకృష్ణదేవరాయలు దర్శించినట్లు, ముస్లిం పాలకులు కూడా ఈ స్వామికి ఆకర్షితులైనట్లు చరిత్ర కథనం. ఆసఫ్‌జాహీ ప్రభువులు మెట్ల మార్గాన్ని నిర్మించారని, ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆలయ అభివృద్ధికి అప్పట్లోనే సుమారు ఎనభై వేల రూపాయలు మంజూరు చేశారని చెబుతారు.

**గుట్టకింద మరో నరసింహుడు**

యాదగిరి క్షేత్రంలో గుట్ట కింద ఉన్న మరో నరసింహస్వామిని భక్తులు 'పాత నరసింహ స్వామి' అని పిలుస్తారు. స్థానికుల కథనం ప్రకారం.. నరసింహుడు తొలుత ఇక్కడే వెలసి, తర్వాత పర్వతం మీదికి తరలివెళ్లాడని, ఆలయంలో కనిపించే పాదముద్రలు ఆ స్వామివేనని నమ్ముతారు.

**దుష్టశక్తులను దునుమాడే దేవుడు**

నరసింహమూర్తిని స్మరిస్తే దుష్టశక్తులూ ఆవరించవని, అనారోగ్యాల నుంచి బయట పడొచ్చని భక్తులు విశ్వసిస్తారు. స్వామి అవతార ఘట్టాన్ని విన్నా, చదివినా భయంతో కూడిన జన్మ రాదని ధర్మరాజుకు నారదుడు ప్రబోధించాడు. అంతరంగంలో కరుణను, బహిరంగంగా రౌద్రాన్ని ఒలికిస్తూ అవతరించిన నరసింహుడిలో హిరణ్యకశిపుణ్ణి సంహరించిన తర్వాత క్రోధం కనుమరుగైందట. అందుకే యాదాద్రి తదితర పుణ్యక్షేత్రాల్లో స్వామి దయానిధిగానే దర్శనమిస్తున్నాడు. యాదాద్రి నరసింహుడు భక్తవత్సలుడు, కోటి భానుతేజుడు, సాధురక్షకుడు, శంఖచక్రహస్తుడు, సర్వేశుడు, క్షీరసాగర శయనుడు – అంటూ వర్ణించాడు శేషప్ప కవి.

**పురాణాల్లోనూ నరసింహుని ప్రస్తావన**

నృసింహ, పద్మ, బ్రహ్మ, బ్రహ్మాండ, స్కాంధ పురాణాలు యాదాద్రి నరసింహుని విశిష్టతను వివరించాయి. ఈ స్వామి కథకు మూలం వాల్మీకి రామాయణంలో కనిపిస్తుంది.

**నిత్యోత్సవాలు, బ్రహ్మోత్సవాలు**

యాదాద్రి నరసింహునికి నిత్యపూజలు చేస్తారు. ఏటా ఫాల్గుణ శుద్ధ విదియ మొదలు ద్వాదశి వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. వైశాఖంలో నృసింహజయంతితో పాటు ధనుర్మాసోత్సవం, శివరాత్రి, కృష్ణాష్టమి, శరన్నవరాత్రి పర్వదినాలను ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు.



# బహుళ ప్రజాదరణ పొందిన రంగస్థలం

**తెలుగు నాటకరంగం ప్రస్తుతం సంక్షోభంలో వుంది. ఒకనాడు ఊరూరా నాటక సమాజాలు ఉండేవి. ఎక్కడ చూసినా నాటకాల ప్రదర్శనలు సందడిగా సాగేవి. ఉత్సవాల్లో భాగంగా నాటకాలు ప్రదర్శించేవారు. కళాకారులకు ఈనాడు సినీతారలకు అభిమానులు వున్నట్లే, అప్పుడు ఆకర్షణ ఉండేది. ప్రస్తుతం వారి స్థితి రంగు వెలిసినజీవితాలు. నాటక ప్రదర్శనలు గత వైభవ చిహ్నాలుగా మిగిలాయి. నాటక పరిషత్తులకే ప్రదర్శనలు పరిమితం అయ్యాయి. వాటి భవిష్యత్తు మెరుగు పడాలంటే, ప్రభుత్వం విస్తృత చర్యలు తీసుకోవాలి. ప్రతీ మండల కేంద్రంలోనూ ప్రదర్శన శాలలు నిర్మించాలి. వారానికి ఒకనాటకమైనా ప్రదర్శించడానికి నిధులు ఇవ్వాలి. రిహార్సల్స్ వేసుకునేందుకు సదుపాయాలు కల్పించాలి. జిల్లా స్థాయిలో, ప్రతి సంవత్సరం నాటకోత్సవాలు నిర్వహించాలి. రాష్ట్ర స్థాయి పోటీలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలి. సాంఘిక, జానపద, పౌరాణిక విభాగాల్లో విడివిడిగా పోటీలు నిర్వహించాలి. ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో నాటక రంగంపై సిలబస్ చేర్చాలి. దేవాలయ ఉత్సవాల్లో విధిగా నాటకాలు ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలి.**

"కావ్యేషు నాటకం రమ్యం" అన్నది భారతీయ సాహిత్యం నుండి పుట్టిన అతి రమణీయమైన వాక్యం. ఇది కావ్యాలలో నాటకానికున్న ప్రాధాన్యతను, ప్రాచుర్యాన్ని చెబుతుంది. ప్రాచీన కాలంలో నాటకానికి ఉన్న ప్రాముఖ్యత అనంతం, అమోఘం అనే చెప్పాలి. చరిత్రను తిరగవేస్తే సుమారుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాలలోనూ, భారతదేశంలోనూ నాటక కళ మొదలైంది. సుమారుగా నాలుగో శతాబ్దంలో పర్షియన్ నాటికలు గ్రీకులు వేశారని చెబుతారు. అయితే భారతదేశంలో క్రీస్తుకు పూర్వం అంటే నాలుగవ శతాబ్దంలో భరతముని రాసిన నాట్య శాస్త్రమే నాటకానికి స్ఫూర్తి అని చరిత్రకారులు చెబుతుంటారు. అలాగే మొట్టమొదటి నాటకం అక్షర రూపం దాల్చింది మాత్రం సంస్కృత భాషలోనే. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, భవభూతి రచించిన మాలతి మాధవీయం, ఉత్తర రామచరిత్ర.... ఇలా ఎన్నో ప్రాచీన నాటకాలు ఇప్పటికీ అవి అపురూపమైనవి, నేటికీ ఆదరణీయ మైనవిగా ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

క్రీస్తు శకం 1860లో ఆధునిక తెలుగు నాటక రంగం ఆవిర్భ ˘వించింది. మొట్టమొదటి ప్రదర్శన 1880లో జరి గింది. 1857లో ముంబై, కలకత్తా విశ్వవిద్యాలయాల్లో ఈ నాటక రంగం గురించి అంకురార్పణ జరిగింది. కోరాడ వెంకటరమణ శాస్త్రి, శ్రీ కొక్కొండ వెంకటరత్నం, పరావస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం, కందుబట్ల సుబ్రమణ్య శాస్త్రి, నాదెండ్ల పురుషోత్తం, వడ్డాది సుబ్బారాయుడు వీరంతా ఆధునిక తెలుగు నాటక రంగ ప్రదర్శన ప్రారంభంలో ప్రథములు, ప్రాచుర్యం పొందిన వాళ్లు, ప్రముఖులుగా చెప్పవచ్చు. ఇలా ప్రముఖులందరితో మమేకమైన ఈ కళ జనపదాల్లో జానపదలకు వినోదాన్ని పంచిన గొప్ప కళ. ఈ నాటకం ప్రజల సమైక్య జీవన సౌందర్యాన్ని, సాంఘిక ఆచార వ్యవహారాల్ని, సమాజంలో వేళ్ళూనుకొని పోయిన సామాజిక రుగ్మతలను ఇలా ఒక్కటేమిటి ఎన్నో విషయాలకు దర్పణం పట్టిన అద్భుతమైన కళ నాటకం. వినోద రంగంలో ఎన్ని నూతన ప్రక్రియలు ఆవిష్కృతమైనా తనదైన ప్రత్యేకతను చాటుకుంది "రంగస్థలం" మీద ఈ నాటకం.




## నాటకం సర్వజననీయం

అలాగే నాటకం అనేది సర్వజననీయం. 64 కళలో ఇది ఒక ప్రాచర్యం పొందినటువంటి అద్భుతమైన కళ. ప్రజలకు చైతన్యం కలిగిస్తూ మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఈ నాటకాన్ని మొట్టమొదటిగా 1961లో వియన్నా దేశంలో "ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్స్టిట్యూట్" వారు మొట్టమొదటగా ప్రపంచ రంగస్థల దినోత్సవంగా ఏర్పాటు చేశారు. దీనికి యూనెస్కో మరియు ఐక్యరాజ్యసమితి కూడా గుర్తింపుని ఇచ్చాయి. అలాంటి నాటక కళ 1961లో వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ అధ్యక్షులు వారు నిర్వహించిన తొమ్మిదవ ప్రపంచ కాంగ్రేసులో ఆనాటి అధ్యక్షులు 'హర్వీనియా' ప్రతిపాదించారు. అక్కడ సభలో ఉన్న సభ్యులందరూ కూడా ఈ ప్రపంచ రంగస్థల దినోత్సవానికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత ప్యారిస్ లో పూర్తిస్థాయిలో రంగస్థల సమాఖ్య ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం నాటక రంగంలో నిష్ణాతులైన ఒకరిని ఎంచుకొని వారి మనోగత సారాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు. అలాగే 1962 లో మొట్టమొదటి రంగస్థల సందేశాన్ని "జీన్స్ కార్టు" అందించారు. ప్రపంచంలో మొట్టమొదటి నాటకాన్ని ఎతెన్స్ నగరంలో థైనోసిస్ అనే థియేటర్లో ప్రదర్శించారు. ఇంత అద్భుతంగా ప్రారంభమైన రంగస్థల దినోత్సవ లక్షణాలెంటో తెలుసుకుందాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ నాటక రూపాల్ని ప్రోత్సహించడం, ప్రజల్లో నాటకంపై అవగాహన కలిగిస్తూ దాని ప్రాముఖ్యతను సవివరంగా తెలియజేయడం. మరో లక్ష్యం ప్రభుత్వాలని, ప్రజా ప్రతినిధులను కలిసి వారికి నాటకం యొక్క ప్రయోజనం, ఇంకా నాటకంపై అవగాహన కలిగిస్తూ ఇలా ప్రభుత్వాలు పెద్దల ద్వారా నాటక రంగాన్ని అభివృద్ధి చేసే గొప్ప లక్ష్యంతో వారికి తెలియజేస్తారు. ఈ నాటకాల ద్వారా ఆనందాన్ని ఇతరులతో పంచుకోవడం, అందరూ మానసిక ఉల్లాసాన్ని పొందడం అనేది కూడా ప్రపంచ రంగాస్థల దినోత్సవం లక్ష్యం. ముఖ్యంగా మన తెలుగు సాహిత్యానికి సంబంధించి పద్య నాటకం అనేది చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రపంచ సాహిత్యంలో ఏ భాషకు లేని విశిష్టత పద్య నాట కానికి ఉంది. అది మన తెలుగువారికే సొంతం. రామాం జనేయ యుద్ధం, గయోపాఖ్యానం ఇలా ఎన్నో ప్రఖ్యాత నాటకాలు ఉన్నాయి.

(మిగతా 8వ పేజీలో)

(7వ పేజీ తరువాయి)

చదువురాని పామరులు సైతం "జండాపై కపిరాజు" అంటూ పద్యాలు ఆలపిస్తారు. అలాగే నాటక ప్రారంభం పద్యంతో మొదలైందని కవులు ఎంత గొప్పగా చెప్పారో చూడండి. "కావ్యేష్ నాటకం రమ్యం/ నాటకేషు శకుంతల/ శకుంతలేషు చతుర్ధాంకం/ నాటకాంతం-హి- సాహిత్యం/". ఎందుకంటే సాహిత్య ప్రక్రియల్లో ఆ రోజుల్లో నాటకమే బాగా ప్రాముఖ్యత పొందింది. ఆ తర్వాత సాహిత్యం నుంచి లెక్కకు మిన్నగా ప్రక్రియలు వచ్చాయి. ఇలా తెలుగువారిని నాటకం అనేది కొన్ని వందల సంవత్సరాల నుంచి అలరిస్తున్న గొప్ప సాహిత్య ప్రక్రియ. అందుకే నాటక రంగం యొక్క విశిష్టతను గుర్తు చేసుకుంటూ నటులను ఆదరించే క్రమంలో ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో యునెస్కో మార్చి 27వ తేదీని ప్రపంచ రంగస్థల దినోత్సవంగా గుర్తించడం వలన మనమంతా ఈరోజు నాటకానికి మరింత శొభగులద్దే దిశలో భాగంగా అంగరంగ వైభవంగా రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటూ రంగస్థల కళాకారుల ప్రతిభకు పట్టం కడుతూ వారి ఖ్యాతిని విను వీధుల్లో ఎగరవేస్తున్నాము.



కవిత్రయంలో ఒకరైన ఎఱ్ఱనామాత్యులు నృశింహ పురాణంలో ఈ ప్రపంచాన్ని నాటక రంగంతో పోల్చుతూ చెప్పిన మనోజ్ఞమైన పద్యమీది. ఆ పద్యంలోని మాధుర్యాన్ని తెలుసుకుందాం. "సురుచిర తారకా కుసుమ/ నభోంగన భూమి కాలమున్/ కరుకు సూత్రధారి జఠంబున/ దిక్పాటి కోటి ముందు టన్/ సరసముగా నటింపగా దిశా/ శతికెత్తిన కొత్తతోపు పందెరయన/ నొప్పె సంధ్య నవ దీరితి/ పశ్చిమ దిక్కు టంబునన్... న్.../". ఈ ప్రపంచమనే నాటకాన్ని నడిపే దర్శకుడు నాటక కర్త, కాలము- చుక్కలు-ఆకాశము నటనా వేదిక, దిక్కులే ప్రేక్షకులు, రాత్రి-చీకటి- పగలు ఈ నాటక రంగంలో రోజు మారుతూ ఉండే తెరలు, రంగులు. ఈ విధంగా ప్రపంచాన్నే ఒక నాటక రంగంగా పోలుస్తూ యఱ్ఱనామాత్యులు మనోగ్నంగా ఈ పద్యాన్ని చెప్పారు. నిజమే కదండి జీవితమే ఒక నాగటరంగం, ప్రతి ఒక్కరు అందులో నటులే. అలాగే నాటక కర్త జోడిడించ్ రంగస్థలం వినోద ప్రదేశమే కాదు వివిధ సంస్కృతుల్ని, జాతుల్ని, మనుషుల్ని ఒకటిగా కలిపే ప్రక్రియ. దీనికి కావలసింది రంగస్థలం, నాటకాభిమానులు. అక్కడే మనం ఆనందిస్తాం, దుఃఖంలోకి నెట్టబడతాం, ఆలోచనలకు అంకురార్పణ చేస్తాం. ఇంకా స్ఫూర్తిని కూడా చెందుతాం. ఇది నాటక రంగస్థల మహత్యం అని చక్కని కితాబునిచ్చారు.



తెలుగు నాట స్వర్ణయుగంలా సాగిపోతున్న రంగస్థల రంగంలో నాటకాని కుండవలసిన లక్షణాలేంటో చూద్దాం. నాంది ప్రస్తావన, విష్కంభం, పంచసందులు, అంక విభజన, భరత వాక్యం ఇవి నాటకానికి సంబంధించిన లక్షణాలు. నాటకమనేది ఒక సమాహారమైన కళ. చతుర్విధ అభినయాత్మకమైన కళని 'నాటకం' అంటారు. ఆ చతుర్విధ అభినయాలు ఏమిటంటే- మొదటిది వాచకం. వాచకం అంటే నోటి ద్వారా వచ్చే పాటలు, మాటలు. వీటిని వాచకం అంటారు. ఆంగికం- శరీర అవయవాల కదలికని ఆంగికం అని పిలుస్తారు. మూడవది ఆహార్యం. నాటకంలో ప్రధానమైనది వేషధారణ. దీనిని ఆహార్యము అని పిలుస్తారు. నాటకంలో పాత్రధారి వేషానికి తగ్గట్టుగా పాత్రధారణ ఉండాలి. ఇది నాటకానికి ప్రధానమైనది. నాలుగవది సాత్వికం. అంటే శరీరంలో కలిగే మార్పులు. దీనిని ఎక్స్ప్రెషన్స్ అంటారు. నాటకం రక్తి కట్టాలంటే బాధలో ఉన్న సన్నివేశానికి బాధని, కోపంలో ఉన్నప్పుడు కోపాన్ని ప్రదర్శించాలి. ఈ నాలుగు అభినయాల్ని నాటకం అంటారు. ఈ చతుర్విధ అభినయాలు ప్రదర్శిస్తూ నాటక రంగంలో ముందుకు సాగుతుంటే మనకి క్రమశిక్షణ అలవడుతుంది, బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలో చెప్పగలుగుతాం. మనం నిజజీవితంలో కొన్ని సందర్భాల్లో ఎలా ప్రవర్తించాలి అన్న విషయంలో నాటకం మనకి చాలా నేర్పుతుంది. ఎదుటివారితో ఆకర్షణీయంగా మాట్లాడడం, మంచిగా మాట్లాడటం, ఎలా మాట్లాడితే ఎదుటి వాళ్ళు ఆకర్షితులవుతారు అన్న విషయాలన్ని కూడా మనం ఈ అద్భుతమైన నాటక కళ నుంచి నేర్చుకోవచ్చు.

ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్న ఈ రంగస్థలం వినోద ప్రదర్శనే కాకుండా వివిధ సంస్కృతులు, జాతులు మనిషిని ఒకటిగా కలిపే అందమైన, అద్భుతమైన ప్రక్రియ. అలాగే ఈ కళ బతుకనిచ్చేది మాత్రమే కాదు, బతుకు పాఠాలు కూడా నేర్పుతుంది. ఇలా ప్రజల జీవితాల్లో ఒక భాగమైన రంగస్థలం సాంకేతికను అందుపుచ్చుకొని ఓ వెలుగు వెలిగింది. కానీ సినిమాలు ఎక్కువగా వస్తున్న నేటి కాలంలో నాటకానికి కొద్దిగా ఆదరణ తగిందనే చెప్పాలి. ఇలా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్న ఈ నాటక కళ మళ్ళీ తన ఉనికిని చాటుకోవాలని ఆరాటపడుతుంది. అందుకే నాటక రంగాన్ని అభివృద్ధి పదంలోకి తీసుకు వెళ్ళాలంటే ప్రభుత్వం రంగస్థల కళాకారులను ప్రోత్సహించి వారికి ప్రోత్సాహకాలు అందజేయాలి. నాటక ప్రియులు ముఖ్యంగా ప్రదర్శనలను ఆదర్శించి వారి వంతుగా చేయూతనివ్వాలి. నేటి యువతకు నాటకాలపై ఆశక్తిని పెంచి వారిని నటనలో ప్రోత్సహించాలి. ప్రపంచ రంగస్థలంలో తెలుగు నాటకానికి ఒక ప్రత్యేక స్థానం కలిగి కల్పించేలా కృషి చేయాలి.

అలాగే ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని తప్పనిసరిగా, విధిగా నాటక ప్రియులందరూ జరుపుకోవాలి. కొత్తతరం యువ నటులను తయారు చెయ్యాలి. అప్పుడే తెలుగు రంగస్థలం కొత్తదనాన్ని సంతరించుకుంటుంది. ఇంకా ఈ తరం రంగస్థల కళాకారులంతా పూర్వ వైభవానికి పట్టంకట్టి తెలుగు కళామతల్లి ఆశీస్సులతో తమ ప్రతిభను విను వీధుల్లో ఎగరవేయాలని కోరుకుంటూ... రంగస్థలం కళాకారులందరికి మరియు అభిమానులకి ప్రపంచ రంగస్థలం దినోత్సవ శుభాకాంక్షలు, జేజేలు, వందనాలు.



- పింగళి
భాగ్యలక్ష్మి
9704725609



శ్రీవిష్ణు అండ్ కామెడీ... సూపర్ హిట్ కాంబినేషన్. లాస్ట్ ఇయర్ 'సామజవరగమన', అంతకు ముందు 'రాజరాజ చోర', 'బ్రోచేవారెవరురా'... కామెడీతో కూడిన కథలు చేసిన ప్రతిసారీ ఆయనకు విజయాలు వచ్చాయి. ఆ సినిమాలు ప్రేక్షకులకు నవ్వులు పంచాయి. 'సామజవరగమన' విజయం తర్వాత శ్రీవిష్ణు హీరోగా నటించిన సినిమా 'ఓం భీమ్ బుష్'. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించారు. 'హుషారు', 'రౌడీ బాయ్స్' ఫేమ్ శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. వి సెల్యులాయిడ్ సంస్థతో కలిసి సురేష్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.

**కథ :** క్రిష్ (శ్రీవిష్ణు), వినయ్ (ప్రియదర్శి), మ్యాడీ (రాహుల్ రామకృష్ణ)... ముగ్గురూ స్నేహితులు. పీహెచ్‌డీ పేరుతో ఓ కాలేజీలో చేరతారు. ఐదేళ్లు అయినా పూర్తి చేయరు. కాలేజీలో వాళ్లు చేసే పనులు చూడలేక, వాళ్లతో వేగలేక ఏకంగా ప్రిన్సిపాల్ రంజిత్ (శ్రీకాంత్ అయ్యంగార్) పరీక్షలు రాసి వాళ్లను బయటకు పంపిస్తాడు. వినయ్ ఊరు వెళుతూ మధ్యలో భైరవపురంలో బండిని ఆపాల్సి వస్తుంది.

భైరవపురంలో తాంత్రిక విద్యల పేరుతో కొందరు డబ్బు సంపాదించడం బ్యాంగ్ బ్రోస్ కంట పడుతుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ టెక్నిక్స్ ప్రజలకు చూపించి తాము డబ్బు సంపాదించాలని రంగంలోకి దిగుతారు. తక్కువ సమయంలో ఊరి ప్రజల్లో ఎక్కువ అభిమానం సొంతం చేసుకుంటారు. నిజంగా ఆత్మలను పట్టి బంధించగల, గుప్త నిధులు కనిపెట్టగల శక్తి సామర్థ్యాలు ఉంటే... ఊరి చివర మహల్ లో సంపంగి దెయ్యాన్ని బ్యాంగ్ బ్రోస్ పట్టుకోవాలని, అందులో నిధులు తీసుకు రావాలని సవాల్ విసురుతాడు అప్పటి వరకు తాంత్రిక విద్యలతో డబ్బు సంపాదించిన మాంత్రికుడు.

సవాల్ స్వీకరించిన క్రిష్ మూడు కండిషన్స్ పెడతాడు. అవి ఏమిటి? సర్పంచ్ కుమార్తె జలజ... జలజాక్షి (ప్రీతి ముకుందన్)తో అతని ప్రేమకథ ఏమిటి? మహల్ లో అడుగుపెట్టిన ముగ్గుర్నీ సంపంగి దెయ్యం ఏం చేసింది? అసలు సంపంగి దెయ్యం నేపథ్యం ఏమిటి? చివరకు ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ:** నో లాజిక్స్, ఓన్లీ మేజిక్... 'ఓం భీమ్ బుష్'కు దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి ఇచ్చిన క్యాప్షన్. అందుకు తగ్గట్టు నిజంగా స్క్రీన్ మీద మేజిక్ చేశారు. కథతో సంబంధం లేకుండా కామెడీతో నవ్వించారు. అలాగని, కథ లేదని కాదు... ఉంది. కానీ, కథను కామెడీ డామినేట్ చేసింది. కథ అంటే కామెడీ ఎక్కువ హైలైట్ అయ్యింది.శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ... ఫెంటాస్టిక్ కామెడీ టైమింగ్ ఉన్న ఆర్టిస్టులు. వాళ్లకు టైలర్ మేడ్ అన్నట్లు దర్శకుడు శ్రీహర్ష డైలాగులు, సీన్లు రాశారు. ఫస్టాఫ్‌లో కాలేజీ ఎపిసోడ్, మెయిన్ లీడ్స్ ముగ్గురి మధ్య సన్నివేశాలు, ఊరిలోకి ఎంటరైన తర్వాత ముగ్గురూ చేసే హంగామా నవ్విస్తాయి. ఇంటర్వెల్ తర్వాత ఘోస్ట్ ఎపిసోడ్ హిలేరియస్‌గా వర్కవుట్ అయ్యింది. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ %d% సంపంగి దెయ్యం మధ్య సన్నివేశాలు... సంపంగి దెయ్యం గురించి శ్రీవిష్ణు అసలు నిజం తెలుసుకునే సన్నివేశం ప్రతి ఒక్కర్నీ నవ్విస్తాయి.

లాజిక్ పక్కనపెట్టినా... క్లైమాక్స్‌లో మేజిక్ వర్కవుట్ కాలేదు. ఒక్కసారిగా కథలో వచ్చిన టర్న్స్, ట్విస్టులతో పాటు శ్రీవిష్ణు క్యారెక్టర్ మారిన తీరును యాక్సెప్ట్ చేయడం కాస్త కష్టంగా ఉంటుంది. కామెడీ మీద ఎక్కువ



దృష్టి పెట్టడంతో కథలో లిబర్టీస్ ఎక్కువ తీసుకున్నారు. ఫస్టాఫ్ రోలర్ కోస్టర్ రైడ్ కింద ఉంటుంది. ప్రీతి ముకుందన్, అయేషా ఖాన్ క్యారెక్టర్లు అలంకారప్రాయంగా మారాయి. శ్రీవిష్ణు లాస్ట్ ఫిల్మ్ 'సామజవరగమన'లో పోలిస్తే... ఇందులో కొన్ని డైలాగుల్లో డోస్ పెరిగిందని చెప్పాలి. ప్రేక్షకుల టికెట్ రేటుకు సరిపడా కామెడీని ఫుల్లుగా అందించింది. మధ్య మధ్యలో నవ్వులకు చిన్న చిన్న బ్రేక్స్ పడతాయి. అయితే... మేజిక్ పక్కనపెట్టి లాజిక్ ఆలోచిస్తే నవ్వుకోవడం కష్టం.

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ మధ్య కామెడీ కెమిస్ట్రీ మరోసారి చక్కగా కుదిరింది. బ్యాంగ్ బ్రోస్ బాగా చేశారు. హీరోయిన్లకు ప్రీతి ముకుందన్, అయేషా ఖాన్‌లకు ఎక్కువ స్క్రీన్ స్పేస్, సీన్లు లభించలేదు. ప్రియా వడ్లమాని ప్రత్యేక గీతంలో సందడి చేశారు. కామాక్షీ భాస్కర్ల ఓ సన్నివేశంలో కనిపించారు. శ్రీకాంత్ అయ్యంగార్, 'రచ్చ' రవి నవ్వించారు.

రాజ్ తోట సినిమాటోగ్రఫీ 'ఓం భీమ్ బుష్'కు బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. ప్రతి ఫ్రేమ్ బావుంది. నిర్మాతలు సైతం ఖర్చుకు వెనుకాడలేదు. కాలేజీ ఎపిసోడ్స్, మహల్ సీన్స్... ప్రతి సన్నివేశంలో రిచ్ నెస్ కనిపించింది. సన్నీ ఎంఆర్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు కొత్త ఫీల్ తెచ్చాయి. ఇంటర్వెల్ ముందు వచ్చే రెండు స్పెషల్ సాంగ్స్ పెప్పీగా ఉన్నాయి. ఇంటర్వెల్ తర్వాత సాంగ్ సైతం బావుంది.

నో లాజిక్స్... ఓన్లీ లాఫింగ్స్... థియేటర్లలో చక్కగా కూర్చుని రెండున్నర గంటలు హాయిగా నవ్వుకోవడానికి 'ఓం భీమ్ బుష్' బెస్ట్ ఆప్షన్. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ... ముగ్గురూ మరోసారి మేజిక్ చేశారు. హ్యాపీగా సినిమాకు వెళ్లవచ్చు. మాసెస్ విపరీతంగా ఎంజాయ్ చేస్తారు.

సారా అలీ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన దేశభక్తి సినిమా 'ఏ వతన్ మేరే వతన్'. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా అండర్ గౌండ్ రేడియో నిర్వహణ ద్వారా ఉద్యమకారుల్లో ఉత్సాహం నింపిన ఉషా మెహతా జీవితం స్ఫూర్తితో రూపొందింది. ఉషా పాత్రలో సారా అలీ ఖాన్ నటించగా... రామ్ మనోహర్ లోహియా పాత్రలో ఇమ్రాన్ హష్మీ నటించారు. ఈ దేశభక్తి సినిమా ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ఎలా ఉంది? ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉందా? లేదా? అనేది రివ్యూలో చూద్దాం.




**కథ :** 1942లో... అవి క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజులు. మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (కరో యా మరో) పిలుపుతో 22 ఏళ్ల ఉషా మెహతా (సారా అలీ ఖాన్) సైతం ఉద్యమంలో భాగం అవుతుంది. ఆమె తండ్రి (సచిన్ ఖేడేకర్) బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జ్. ఆయన్ను ఎదిరించి మరీ దేశం తరఫున పోరాటానికి వెళుతుంది. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా రేడియో స్టేషన్ నిర్వహిస్తుంది. ఆమెకు రామ్ మనోహర్ లోహియా (ఇమ్రాన్ హష్మీ) నుంచి ఎటువంటి మద్దతు లభించింది? రేడియో నిర్వాహకులను పట్టుకోవడం కోసం ముంబై ఇన్‌స్పెక్టర్ (అలెక్స్ ఓ నీల్) ఏం చేశారు? ఈ ప్రయాణంలో ఉషాను ప్రేమించిన కౌశిక్ (అభయ్ వర్మ), ఫహాద్ (స్పర్ష్ శ్రీవాత్సవ్) పాత్రలు ఏమిటి? చివరకు ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** 'కొంత మందికి విప్లవం అంటే ప్రేమ. ఇంకొంత మందికి ప్రేమే విప్లవం' – పతాక సన్నివేశాలకు ముందు కౌశిక్ చెప్పే మాట. ఉషా మీద ప్రేమతో ప్రాణ త్యాగానికి అతడు సిద్ధపడితే... దేశం మీద ప్రేమతో ప్రాణాలకు తెగించి ఉషా మెహతా ఏం చేశారు? అనేది సినిమా. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో పాల్గొన్నారు. అయితే... కొందరి కథలే ప్రజలకు తెలుసు. చరిత్రపుటల్లో ప్రజలకు తెలియని గొప్ప పోరాట యోధుల కథలను ఈ మధ్య వెండితెరకు తీసుకొస్తున్నారు. అటువంటి కథే 'ఏ వతన్ మేరే వతన్'.

'ఏ వతన్ మేరే వతన్' దర్శకుడు కణ్ణన్ అయ్యర్, రచయిత ఫరూఖ్ ఆలోచన, ఉద్దేశం చాలా గొప్పవి. ఉషా మెహతాతో పాటు రామ్ మనోహర్ లోహియా పోరాటాన్ని తెరపైకి తీసుకొచ్చి, ఈ తరం ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారు. అయితే... ఆచరణలో విజయానికి సుదూరంలో నిలిచారు. సినిమా చూస్తున్నప్పుడు ఆడియన్స్‌లో దేశభక్తి కలిగించడంలో సినిమా విఫలమైంది. ప్రొడక్షన్ డిజైన్, మ్యూజిక్, నిర్మాణ విలువలు బావున్నాయి. కానీ, కోర్ పాయింట్ మిస్ అయ్యింది. ప్రేక్షకులకు దగ్గర కాలేదు.

ఉషా మెహతా పాత్రకు సారా అలీ ఖాన్ పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదు. ఆమె రూపం బావుంది. కానీ, నటనలో దేశభక్తి కనిపించలేదు. పోరాటంలో తెగువ చూపే సన్నివేశాల్లో వీరత్వానికి బదులు అమాయకత్వం కనిపించింది. అందువల్ల, తెరపై జరిగే పోరాటంలో, స్వాతంత్ర్య సమరంలో ప్రేక్షకుడు ప్రయాణించడం కష్టంగా మారింది. రామ్ మనోహర్ లోహియాగా ఇమ్రాన్ హష్మీ నటన బావుంది. అయితే, ఆయన స్క్రీన్ ప్రజెన్స్ తక్కువే. మిగతా నటీనటులు సైతం తమ పాత్రల పరిధి మేరకు నటించారు. కానీ, కథతో ట్రావెల్ అయ్యేలా కథనం, సన్నివేశాలు లేకపోవడం సినిమాకు పెద్ద మైనస్.

'ఏ వతన్ మేరే వతన్' మెయిన్ ప్రాబ్లమ్.... ఉషా పోరాటాన్ని దర్శకుడు సరైన రీతిలో ఆవిష్కరించలేకపోవడం. తండ్రిని ఎదిరించిన తరుణంలో దేశంపై ఆమెకున్న ప్రేమను, ఆమె వ్యక్తిత్వాన్నిబలంగా ఆవిష్కరించే వీలు దొరికింది. దాన్ని సద్వినియోగం చేసుకోలేదు. సంభాషణలు సినిమాకు బలాన్ని ఇవ్వలేదు. ఆ తర్వాత రేడియో స్టేషన్ నిర్వాహకులను పోలీసులు పట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు క్యాట్ అండ్ మౌస్ గేమ్ తరహాలో ఉంది కానీ ఉత్కంఠ కలిగించలేదు. పతాక సన్నివేశాలు సైతం ప్రభావంతంగా లేవు.

ఉషా మెహతా ఎవరో తెలియని ప్రజలు ఆమె చరిత్ర తెలుసుకోవడానికి 'ఏ వతన్ మేరే వతన్' చూడవచ్చు. చరిత్రతో పాటు సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే ప్రేక్షకులు అయితే డిజప్పాయింట్ అవుతారు. రెండుంపావు గంటల సినిమా చూసినా నిడివి ఎక్కువైన ఫీలింగ్ కలుగుతుంది. పేరున్న నటీనటులు, నిర్మాతలు కలిసి చేసిన డాక్యుమెంటరీ తరహాలో ఉంది సినిమా.

# సినిమా రివ్యూ




మార్చినెల శుక్రవారం 15వ తేదీన "రజాకార్" సినిమా విడుదలైంది. ఈ సినిమా నిర్మాణం పూర్తి అయి రెండు సంవత్సరాలైంది. ఈసినిమా దర్శక నిర్మాతలు ఇప్పటికే పలు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. మొత్తంగా నిజాం పాలనా కాలంలో హిందువులపై ముస్లీం పోలీసులు,ఖాసీం రజ్వీ నాయకత్వంలో కిరాయి 'రాజాకార్' సాయుధ సైనిక దళం అనేక దుర్మార్గాలను చేసింది. అయితే ఇప్పుడు వాటిని తవ్వితీయటంలో ఉద్దేశం అందరికీ తెలిసిందే. ఈ సినిమా ద్వారా రానున్న పార్లమెంటరీ ఎన్నికల ముందు దేశమంతటా వివిధ భాషల్లో విస్తృతంగా ప్రదర్శించి, హిందూ సమాజం ఓటర్లను గంపగుత్తగా సమీకరించి, ముస్లీం పాలకులు,వారి రజాకార్ సైన్యం, దుర్మార్గాలను అతిగా చిత్రీకరణ చేసి చూపించి ముస్లీం ప్రజలంతా దుర్మార్గులే అన్న 'నరేటివ్' ను చూపెట్టే ప్రయత్నం చేశారు. గత 75 ఏళ్ళుగా హిందూ,ముస్లీంలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారు. అప్పుడప్పుడు రాజకీయ నాయకుల మూలంగా ఎన్నికల సమయంలో, పండుగల సందర్భంలో ఇరుపక్షాల మధ్య చెదురుమదురు సంఘటనలు జరిగి ఉండవచ్చు. వాటిని భూతద్దంలో చూడకూడదు. ఈ సినిమా 'తెలంగాణ సాయిధ పోరాట 'నేపథ్యంలో వచ్చిన మరో సినిమా. గతంలో నరసింహారావు నిర్మించి, దర్శకత్వం వహించిన "మాభూమి"బ్లాక్ అండ్ వైట్ సినిమాగా వచ్చింది. ఈ సారి దాదాపు అదే భూమికపై వచ్చిన "రజాకార్" కలర్ లో వచ్చిన సినిమా పాత 'మాభూమి' సినిమాను మరిపిస్తుందని అందరూ ఆశించారు. కానీ ఆ లక్ష్యం నెరవేరలేదు. సినిమాను ఆధునిక సాంకేతిక విలువలతో రూపొందించారు. చిత్రనిర్మాణంలో అధిక ఖర్చులకు వెరవ కుండా భారీగా నిర్మించారు. ఈ సినిమా లక్ష్యం ఏమిటి?అని చూసుకుంటే, "చరిత్రను విస్మరించేవారు చరిత్రను నిర్మించలేరు". అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. గత చరిత్ర ఆధారంగా రూపొందే సినిమాలు, సీరియళ్ళలో కొంత "సినిమాటిక్ " గా చేర్పులు,మార్పులు కథా,కథనాల్లో ఉండవచ్చు కానీ, పూర్తిగా చరిత్రను వక్రీకరణలు చేయటం,గత చరిత్రను పూర్తిగా విస్మరించే పనిమాత్రం చేయకూడదు.

ఈ 'రజాకార్' సినిమా చరిత్రను పూర్తిగా విస్మరించడమే కాదు, వాస్తవ చరిత్రను ఉద్దేశ పూర్వకంగా వక్రీకరించడం ఈ సినిమాలో జరిగింది. నిజంగా ఈ సినిమా గతలో జరిగిన చరిత్రను, సంఘటనలను, వ్యకుల పాత్రలను, సమూలంగా చెరిపి వేసే ప్రయత్నం చేశారు. హిందూ,ముస్లీం సమాజంలో నెలకొని ఉన్న సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా చెదురుముదురు సంఘనలను అతిగా ఫోకస్ చేసి ముస్లీం సైనికులు,ముస్లీం ప్రజలంతా దుర్మార్గులు వారు హిందువును అనేక రకాలుగా వేధించారు అని హిందువులను రెచ్చగొట్టే ప్రయత్నం ఈ సినిమా ద్వారా చూపెట్టారు. బీజేపీ రాజకీయ సిద్ధాంతానికి అనుగుణంగా గతంలో వచ్చిన " కాశ్మీరీ ఫైల్స్" "కేరళా స్టోరీ " మాదిరి గానే ఈసినిమా కూడా అదే ప్రేరణతో ఈ సినిమా తీసారు. ఈ సినిమాలో ప్రధానంగా చెప్పదలచిన విషయం ఏమిటంటే "చనిపోయే వారంతా అమాయక హిందువులు. చంపేవారంతా కృరీర ముస్లీంలు" అనే అర్థంలో ఈ సినిమాలో చూపెట్టారు. కొన్ని హింసా సంఘటనలను మొత్తం ముస్లీం సమాజానికి ఆపాదించారు. ముస్లీంల మీద హిందువుల లో ద్వేషాన్ని రెచ్చగొట్టే ధోరణే ఈ సినిమాలో కనిపించింది. షోయబుల్లా ఖాన్ ను చంపింది నిజాం రజాకార్ సైనిపకులే. అందులో సందేహం లేదు. కానీ ఈ దుచ్చర్యను సాకుగా చూపి, మొత్తంగా ముస్లీంలపై హిందువులను రెచ్చగొట్టే చర్య ప్రమాదకరమైంది. సమాజ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేదిగాఉంది. మెజార్టీ హిందూ మతస్తుల ఓట్ల కోసం ఒకే పార్టీకి ఓట్లు పడే విధంగా చేయటానికి ఈ చిత్రన్ని దుర్మార్గంగా ఈ చిత్ర దర్శక,నిర్మాతలు నిర్మించారు. దీనికి వీరు పూర్తిగా బాధ్యత వహించక తప్పదు.

ఎప్పుడో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా(1836-60)లో రాంజీ గోండ్ నాయకత్వంలో జరిగిన తిరుగుబాటును ప్రస్తుతం మత మార్పిడులకు వ్యతిరేకంగా హిందువులు చేసేన పోరాటంగా చిత్రీకరణ చేయటం చారిత్రిక తప్పిదం కాదా? బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన రాంజీ గోండు పోరట కథనాన్ని' నిజాం వ్యతిరేక పోరాటం చరిత్రతో మిళితం చేయటం ఏవిధంగా సబబు అవుతుంది. ఇలాంటి ఊహాకల్పనలు జరిగిన చరిత్రకు ఆపాదించటం సరైంది కాదు.

**తెలంగాణ సాయుధ పోరాటం**

ప్రపంచ చరిత్రలోనే అరుదైన పోరాటంగా పేరుపొందింది. దీనిపై ఎన్నో ప్రామాణిక పుస్తకాలు,కథలు,పాటలు,కళా రూపాలు,పోరాడిన వారి జీవిత చరిత్రలు,వెలువడినాయి. అవి ప్రజలకు అందుబాటులో కూడా ఉన్నాయి. ఆనాడు ప్రత్యక్షంగా పోరాడిన వారి అనుభవాలను ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలను రికాక్డు చేసిన ఆర్కీవ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిని దర్శక నిర్మాతలు ఏమాత్రం పట్టించుకోలేదు. రజాకార్ ఉద్యమంపై నిజాలు ఏమిటో కనీసం తెలుసుకొనే ప్రయత్నం కూడా వారు చేసినట్లు కనిపించదు. పైగా కేవలం ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారనే కల్పిత కథనాన్ని జోఢించారు. ఈ పోరాటం హిందూ, ముస్లీం మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరణ చేశారు. ముస్లీం పాలకుడు,వారి రజాకార్ సైనికుల పీడన నుండి విముక్తి కొరకు,హిందువులు మత స్వేచ్ఛకోసం పోరాడిన చరిత్రగా ఈ సినిమాను ఉపయోగించకున్నారు. ఇదిగత చరిత్రను పూర్తిగా వక్రీకరించేటమే అవుతుంది. ఈ సినిమాలో పాత్రల ద్వారా వినిపించిన డైలాగ్స్ కూడా అసత్యాలతో,మసాలా ధట్టించి ఒక మతం వారిపై విధేవేశాన్ని రెచ్చగొట్టేలా చూపెట్టారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కుల, మతాలకు,లింగ విభేధాలకు అతీతంగా గ్రామాల్లో అణగారిన ప్రజలందరూ సామూహికంగా, ఐక్యతతో చేసిన ఉమ్మడి ప్రజాపోరాట చరిత్రను విస్మరించి, సర్దార్ వల్లభాయ్ పటేల్ ను హీరోగా చేసి చూపెట్టే కథగా తీర్చిదిద్దారు. మొత్తం సినిమా కధనం అంతా ఆయన చుట్టే తిరిగేలా చూపెట్టారు. ఇది చరిత్రను పూర్తిగా విస్మరించటమే అవుతుం ది. పటేల్ నాయకత్వంలో భారత సైన్యాలు, రజాకార్ పీడనల నుండి,దాష్టికాల నుండి ఈ ప్రాంత ప్రజలను విముక్తి చేసినట్లు చిత్రీకరణ చేశారు. ఇది పూర్తిగా సత్యదూరం కాదా? నిజానికి నిజాం పాలనా కాలంలో హిందువులు చనిపోయిన దానికంటే మూడు రెట్లు సర్దార్ పటేల్ "పోలో యాక్షన్ టీం సైనిక చర్య" దుర్మార్గమైంది. వారు కమ్యూనిస్టులను పేరుతో హిందువులను, మతం పేరుతో ముస్లీంలను ఊచకోత కోశారు. హిందూ,ముస్లీం స్త్రీలను లెక్కకు మిక్కిలిగా సామూహికంగా చెరిచింది పటేల్ సైన్యాలే. ఆ విషయాన్ని ఈ సినిమాలో దాచేశారు. ఆ దృష్యాలను మాత్రం చూపలేదు. అసలైన చరిత్ర ఏమిటంటే, మాతృభాష పరిరక్షణ కోసం," భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి బానిస విముక్తికోసం" మట్టి మనుషులు చేసిన గెరిల్లా తిరుగుబాటు పోరాట చరిత్రనే "తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అంటారు. అలాంటి చరిత్రకు వక్రీకరణలు చేయటం న్యాయం కాదు. "భాంఛన్ దొరా నీ కాళ్ళు మొక్కుతా" అన్న "వెట్టి " వ్యవస్థ పై సాధారణ మనుషులు చేసిన వీరోచిత పోరాట గాధను ఈ సినమాలో మరుగు చేశారు. "దొర ఏందిరో ...నీ దొరతనం మేందిరో" అంటూ ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వన బందూకును చేపట్టిన విప్లవాత్మక ఆధార సహిత చరిత్రను ఉద్దేశ పూర్వకంగా ఈ సినిమా విస్మరించింది. ఆనాటి 'తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర(1946-51) నిజాం పెత్తందారి తనానికి, వారికి అడుగులకు, మడుగులొత్తిన భూస్వాముల దోపిడీకి, జమిందారీ గడీల నిరంకుశత్వానికి, వెట్టి చాకిరీ బానిస వ్యవస్థకు, పాలేగాళ్ళకు, దేశముఖులకు,ఇనాం దార్లకు, ఇతర పోలీసు,రెవెన్యూ పీడక పాలనా వ్యవస్థలకు,వారి తాబేదార్ల సొంత రౌడీ గ్యాంగుల దౌర్జన్యాలకు,దాష్టికాలకు వ్యతిరేకంగా ఆనాటి కమ్యూనిష్టుల నేతృత్వంలో జరిపిన ప్రాణ త్యాగాల వీరోచిత పోరాటమది. ఈ సినిమా దర్శక నిర్మాతలు దాచేస్తే దాగని అవశేషాలు తాజాగా ప్రజల జ్ఞాపకాల్లో స్థిరంగా ఉన్నాయి. ఆనాటి చారిత్రిక సంఘటనలను అభూత కల్పనలతో మరుగున పెట్టాలని చేసిన ప్రయత్నమే ఈ 'రజాకార్ ' సినిమా. దీని దర్శక, నిర్మాతలు ఉద్ధేశ పూర్వకంగా చేసిన చారిత్రక తప్పిదం మాత్రమే కానీ, తెలియక చేసిన నేరం కాదు. ఒక రకంగా" స్టేట్ స్పాన్సర్డ్ నరేటివ్" గా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా మొత్తంలో ఎక్కడా కమ్యూనిస్టు నాయకుల పాత్రగానీ,వారు చేసిన ప్రాణ త్యాగాల ప్రస్తావన గాని చేయలేదు.,"ఆంధ్ర మహాసభ " పాత్రను ఉద్దేశ పూర్వకంగా విస్మరించారు. ఆనాడు ప్రజలు "ఆంధ్ర మహా సభ జిందా బాద్" అంటూ నినాదాలు చేశారే గానీ, "వైదిక మతం జిందాబాద్" అని ఎక్కడా నినదించలేదు. అయినా ఈ సినిమాలో "వైదిక మతం జిందాబాద్" అంటూ నినాదాలు చేసినట్లు చూపడం, కావాలనే ఒక రాజకీయ పార్టీకి రాబోయే ఎన్నికల్లో లబ్ధి చేకూర్చే పనిగా తలకెత్తుకోవడం కనిపించింది.

**"చరిత్రలో సత్యాలను దాచేస్తే దాగవు".**

" నిజాం వ్యతిరేక పోరాటం" అంటే హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని రక్షించడానికి గ్రామాల్లో ప్రజలు తిరుగుబాటు చేశారు అనే అబద్ధాన్ని ఈ సినిమాలో చూపారు. కావాలనే ఒక వర్గం పట్ల వ్యతిరేక నినాదాలు చేర్చి ఈ సినిమాలో చూపించారు." మనుషులను చంపగలరు కానీ, మా మతాన్ని, హిందువులను చంపలేరు" అనే డైలాగ్ ను కావాలనే చొప్పించారు. మతకోణంలో ఈ పోరాటం జరిగినట్లు చూపించారు. విసునూరు రామచంద్రారెడ్డి గుండాలు చంపిన షేక్ బందగి, రజాకారుల చంపిన ముస్లిం జర్నలిస్టు షోయబుల్లాఖాన్ ఎవరో చెప్పగలరా? గ్రామాల్లో అరాచకాలకు కిరాయి అడ్ర స్ కలిగిన రజాకార్ల సైన్యానికి అధ్యక్షుడు కాసిం రాజ్వి అయితే,దానికి ఉపాధ్యక్షుడు విసునూరు రామచంద్ర రెడ్డి అనే దొరది అనేది ఆనాటి ప్రజలకు తెలియదా? ప్రజలపై దాడులు,మానభంగాలు,హత్యలు చేసినసాయుధ రజాకారులకు విడిది ఏర్పాట్లు,విందు వినోదాలు ఏర్పాట్లు చేసింది ఈ హిందూ దొరలే అన్న నిజాన్ని ఈసినిమాలో చూపలేదు.

ఈ విముక్తి పోరాటంలో అశేష త్యాగాలు చేసిన కమ్యూనిస్టుల త్యాగాలు గురించి,ప్రజా నాయకుల గురించి,ఆనాటి కవులు,రచయితలు, కళాకారులు,యువజనులు,మహిళా నేతల పాత్రల గురించి మచ్చుకైనా ఈరజాకార్ సినిమాలో చూపలేదు. కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజలు గ్రామ రక్షణ గెరిల్లా దళాలను ఏర్పాటు చేసింది,ఆయుధ శిక్షణ నేర్పింది కమ్యూనిస్టులే ఈ చారిత్రిక నిజాలను ఈ సినమా చూపలేదు. ఈ పోరాటాల వల్ల ప్రాణ భయంతో గ్రామాల నుండి దొరలు హైదరాబాద్ పట్టణానికి పారిపోయారు. కమ్యూనిస్టులు భూసంస్కరణ అమలు జరిపి సుమారు 12 లక్షల ఎకరాలు భూమిని నిరుపేదలకు పంచారు. వెట్టి చాకిరిని, బానిసత్వాన్ని రద్దు చేశారు. భూస్వాముల బీరువాల్లో దాచిన రుణ పత్రాలను కుప్పపోసి తగులబెట్టారు. అప్పులు,వడ్డీలు ఒక్క దెబ్బతో రద్దయ్యాయి. స్త్రీలకు సమాన హక్కులు కల్పించబడ్డాయి. అంటరానితనం పోయి కుల,మత వివక్షత లేకుండా కలిసికట్టుగా ప్రజలు జీవించే నేపథ్యాన్ని ఆనాటి నేతలు ప్రోదిచేశారు. తదుపరి కాలంలో ఈ సాయిధ పోరాట అనుభవాలు అనేక ప్రజా పోరాట ఉద్యమాలకు బాటలు వేసింది. ఒక ధైర్యాన్ని ప్రేరణను తెలంగాణ ప్రజలకు ఆయుధంగా ఇచ్చింది. కమ్యూనిస్టు పోరాటం వల్లనే గ్రామాల్లో పీడన,బానిసత్వం నుండి ప్రజలు విముక్తి పొందారు. కుండల్లో కారం,చీపిరి కట్టలు,రోకళ్ళ మహిళల చేతుల్లో ఆయుధాలు అయ్యాయి. చాకలి ఐలమ్మ,మల్లు స్వరాజ్యం,కాళూజీ,దాశరథీ కవితలు,ఉపన్యాసాలు,వారి మాటలు, చేతలు యువకులను తిరుగుబాటుకు ప్రేరణను ఇచ్చాయి. "దున్నేవాడికే భూమి" అనే నినాదం గ్రామీణ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. దొరల దోపిడికి వ్యతిరేకంగా భూస్వాములపై ఎర్రజెండా నీడలో సామాన్య ప్రజలు పోరాటం చేశారు. గడీలు బద్దలు కొట్టారు. ప్రజలంతా కుల మతాలకు,లింగ వివక్షతలకు అతీతంగా నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేశారు. ఈ మట్టి మనుషులు త్యాగాల చరిత్రను ఈ సినిమాలో చూపెట్టలేదు. పైగా హిందూ ,ముస్లీంల పోరట చరిత్రగా సంకుచిత బుద్ధితో వక్రీకరించి చూపించారు. కేవలం మతకోణంలోని పోరాటాన్ని చూపడం, పీడితులు చేసిన గొప్ప పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియకుండా మరుగు చేయటం అపరాధం కూడా.

తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత పాత్ర వహించిన దొడ్డి కొమరయ్య,బద్ధం ఎల్లారెడ్డి,పుచ్చలపల్లి సుందరయ్య,రావి నారాయణ రెడ్డి,ముఖ్ధుమ్ మెయినుద్ధీన్,మల్లు స్వరాజ్యం,ధర్మ బిక్షం,బెల్లంకొండ సత్యయ్య ,కాళోజీ,దాశరథీ సోదరులు మొన్న మొన్నటివరకు వారి అనుభవాలను తమ రచనల్లో నిక్షిప్తం చేశారు. వారిఅనుభవాలను,జ్ఞాపకాలను అనేకవేదిక మీద ప్రజలతో పంచుకున్నారు. వారి జీవిత చరిత్రలు, వారు రాసిన కవితలు, పుస్తకాలను క్షుణ్ణంగా చదివిన వారు, ఆనాటి ప్రజా నేతలు మాటలు, ఉపన్యాసాలు ప్రత్యక్షంగా విన్నవారి మెదెళ్ళలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర భద్రంగా, పదిలంగా తాజాగా ఉన్నాయి. అలాంటి నిరుపమాన ప్రజానేతలు, కమ్యూనిస్ట్ నేతల త్యాగాలను ప్రజలు ఎన్నటికీ మరువ లేరు. ఈ రజాకార్ సినిమా ద్వారా ప్రభుత్వ అండతో డబ్బులు సంపాధించ గలరేమో గానీ, భారతీయ/ తెలుగు సినిమా చరిత్రలో దర్శక నిర్మాతలు "ప్రపంచ ప్రఖ్యాత, వీరోచిత, తెలంగాణ సాయుధ పోరట చరిత్రను" ఉద్దేశ్యపూర్వకంగా వక్రీకరణలు చేసిన "రజాకార్" దర్శక నిర్మాతలు శాశ్వితంగా చరిత్రహీనులుగా మాయని మచ్చతో మిగిలిపోతారు.

**– డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్, 9849328496.**

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 24.3.2024 నుంచి 30.3.2024 వరకు



## మేష రాశి
అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో సంతానము అభివృద్ధి ఆశాజనకంగా ఉంటుంది. గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నాలకు మీ ఆత్మీయుల సహకారం తోడ్పాటు అందిస్తారు. రావలసిన రుణములు అందుకుంటారు. విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సన్నద్ధులు అవుతారు. వారం మధ్యలో ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఆహ్వానాలని అందుకుంటారు. వారం చివరిలో రీసర్చ్ చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. అభివృద్ధి కొరకు చేయి ప్రయత్నాలు సంతృప్తికరంగా ముందుకు సాగుతాయి. భాగస్వామి మరియు తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలి.



## వృషభరాశి
కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో సమయానికి ఆహార స్వీకరణ మంచిది తగిన విశ్రాంతి అవసరము. జ్ఞాపక శక్తిని మెరుగు పరుచుకునే విషయాల్లో శ్రద్ధ వహించాలి విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. వృత్తిపరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపుని గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వాతావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్దల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు. రావలసిన బాకీలను వసూలు ఊరట పొందుతారు.



## మిధున రాశి
మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోగృహాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వాహనములకు సంబంధించిన చిన్నబాటి రిపేర్లు. స్థిరాస్తులు అంశములలో ఆత్మీయులతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేస్తే సిబ్బంది సహాయం, ఆకస్మికమైన విషయాలలో కొంతలాభం,శుభకార్యాలకు ఆహ్వానాలు, వారం మధ్యలో మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో సోషల్ మీడియాలో పెట్టుబడి ఆలోచనలు చేస్తారు. స్త్రీల సహకారాన్ని పొందుతారు. భాగస్వామికి గుర్తింపు గౌరవం లభిస్తుంది. విదేశాలలో ఉండే వ్యక్తుల సహకారం లభిస్తుంది.



## కర్కాటక రాశి
పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభం చుట్టుపక్కల వ్యక్తులతో కమ్యూనికేషన్ విషయాల్లో అపార్ధాలు రాకుండా జాగ్రత్త పడాలి. ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు ప్రణాళిక చేసుకుంటారు. మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి. సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువుల సహకారాన్ని ఆశిస్తారు. రచయితలకు గుర్తింపు. వారం మధ్యలో విద్యార్థులు విద్య మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి అనవసర విషయాలకు దూరంగా ఉండాలి. గృహ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన, భూసంబంధ అంశములలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో ఆచితూచి వ్యవహరించాలి.



## సింహ రాశి
మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో రావలసిన ఆదాయము సమయానికి అందడంలో కొంత ఆలస్యం నిరాశను కలిగిస్తుంది. కుటుంబ వ్యక్తులపై కోపాన్ని నియంత్రించుకోవాలి. ఎదుటివారితో మాటల వల్ల అపార్ధాలు రాకుండా జాగ్రత్త వహించాలి. వృత్తిపరంగా ఉన్నతాధికారులతో వాగ్వాదాలకు లోను కాకుండా సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి. వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వారం మధ్యలో సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. స్థిరాస్తుల పెట్టుబడుల విషయాలలో కుటుంబములోని పెద్దలను సంప్రదిస్తారు



## కన్యా రాశి
ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో మనసుకు కొంత ఆహ్లాదకరంగా ఉంటుంది, విందు వినదాల్లో పాల్గొంటారు ఇచ్చిన రుణములు కొంత కష్టం మీద తిరిగి వస్తాయి. నూతన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. తల్లితండ్రుల సహకారం లభిస్తుంది నూతన పెట్టుబడుల కొరకు గృహ వాహన మార్పుల కొరకు ఆలోచనలు చేస్తారు.బాగ స్వామికి వృత్తిపరమైన విషయాలలో అధిక శ్రమ నూతన బాధ్యతలు. అధికారుల సహకారంలో ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల కొంత నిరాశ ఎదురవుతుంది. సంతానము ఎక్కువ శ్రమతో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. దూర ప్రదేశాలలో ఉండే వ్యక్తుల సహాయ సహకారము



## తులారాశి
చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో రావలసిన లాభాలు ఆదాయం అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. వృత్తిపరమైన విషయాలు వ్యాపార లావాదేవిలు కుటుంబ, గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో అధికారంలో ఉండే వ్యక్తుల సహకారం కొంత నిరాశ కల్పించినప్పటికీ వారం మధ్యలో అనుకూలతే సిద్ధిస్తుంది. సంఘంలో గౌరవము మర్యాద కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సంతానమునకు అభివృద్ధి విదేశీ అవకాశాలు విద్యలో ముందు ఉండడం మీకు కొంత ఆనందాన్నిస్తుంది. వారం మధ్యలో కళాకారులకు అనుకూలమైన సమయం. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి గవర్నమెంట్ సంబం ధిత టాక్సును చెల్లిస్తారు,



## వృశ్చిక రాశి
విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోస్థిరాసుల మీద ఆదాయం అందుకోవడం జరుగుతుంది. మనసులోని కోరికలు నెరవేరడం, చిన్న నాటి మిత్రులను కలుస్తారు. విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది.విద్యార్థులు చాలా శ్రమ పడతారు. జ్ఞాపకశక్తి పెంచుకోవాలి. ఆకస్మికమైన ఖర్చులు అధికంగా ఉంటాయిభాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో, సాంఘిక పరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. స్త్రీలకు ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. సంతానమునకు వృత్తిపరమైన అవకాశాలు, ఉన్నత అధికారుల సహాయ సహకారాలు కొంత ప్రయత్నం మీద కష్టంగా అందుతాయి. భూసంబంధిత వారసత్వ అంశాలలో సోదర వర్గంతో దీర్ఘంగా చర్చిస్తారు, వారం మధ్యలో రావలసిన లాభాలు కొంత ఆలస్యం ఆటంకం.



## ధనస్సు రాశి
మూల 1,2,3,4 పాదములు పూర్వాషాడ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. తోబుట్టులు సహకారంతో కష్టం మీద పనులు నెరవేర్చుకుంటారు. విద్యార్థులు అధిక శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. గృహ అలంకరణ వస్తువులు కొంటారు. వారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది వారం మధ్యలో భాగస్వామితో అపార్ధాలు రాకుండా జాగ్రత్త వహించాలి. దూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది. విదేశీ ఉపాధి కొరకు ప్రయత్నాలు చేస్తారు. వారము చివరిలో ఆత్మీయులైన వ్యక్తుల కొరకు ఖర్చు అధికముగా చేస్తారు.



## మకర రాశి
ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఉపాసనాపరమైన అంశాలలో కొన్ని అవరోధాలు ఎదుర్కొంటారు. ప్రయాణాలు కొంత చికాకును కలిగిస్తాయి. విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి ఉంటుంది. భాగస్వామితో, సంతానముతో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి. ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. వారం మధ్యలో కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయుల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు. వారం చివరిలో భాగస్వామికి ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది.సంతానం కొరకు, బహుమాన రూపంలో ఖర్చులు అధికంగా చేస్తారు. వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు,



## కుంభ రాశి
ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

ప్రారంభంలో సంబంధము లేని వ్యక్తుల ఊహించని విమర్శలు మనసుని కలవర పెడతాయి. సంఘంలో గౌరవం, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు,ఆరోగ్య విషయాలు మొదలైన ముఖ్యమైన అంశములలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యమైన పనులు ఆకస్మికంగా వాయిదా పడతాయి ప్రతి విషయంలోన ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగిస్తాయి. సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్న ప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపార్థాలకు అవకాశము. స్త్రీలతో ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. స్థిరాస్తుల అంశాలలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో మెలకువగా వ్యవహరించాలి. పరిచయస్తులు మోసం చేసేందుకు అవకాశం ఉంది. వారము చివరిలో మానసిక ప్రశాంతత తగ్గుతుంది.



## మీనరాశి
పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వార ప్రారంభంలో సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు. చాలా ఉత్సాహంగా ఉంటారు భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి రుణములు చెల్లిస్తారు కొత్తరుణం కొరకు ప్రయత్నం చేస్తారు. సేవకులు సహకరిస్తారు. కుటుంబంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. వారం మధ్యలో ఆరోగ్య శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది.

ప్రగ్యా జైస్వాల్

